Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 28.03.2014, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 43 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



నెల్లూరు నగరం

# నువ్వా - నేనా

→ ఉధృతంగా ముగిసిన ప్రచారం
→ ఎన్నికలకు సన్నద్ధమైన ఇరు పార్టీలు
→ పూర్తి మెజార్టీ కోసం విశ్వప్రయత్నం
→ కాంగ్రెస్, సీపీఎం, బీజేపీలు కీలకం




**నెల్లూరు నగరపాలకసంస్థ మరో మహా సంగ్రామానికి ముస్తాబయ్యింది. ఈ నెల 30వ తేదీన ఎన్నికలు. మొత్తం 54డివిజన్‌లు ఎన్నికలకు సిద్ధమయ్యాయి. అధికారయంత్రాంగం కూడా ఎన్నికలకు సన్నద్ధమైంది. పోటీలో తెలుగుదేశం, వైయస్సార్‌కాంగ్రెస్, కాంగ్రెస్‌లు ఉన్నప్పటికి ప్రధానపోటీ టీడీపీ, వైసిపిల మధ్యే నెలకొంది. సీపీఎం 16డివిజన్‌లలోనూ, బీజేపీ 14డివిజన్‌లలోనూ పోటీ చేస్తున్నాయి.**

మేయర్ పదవికి ఇవి ప్రత్యక్ష ఎన్నికలు కావు. ఏ పార్టీకి మెజార్టీ డివిజన్‌లు వస్తే ఆ పార్టీనే కార్పొరేషన్‌లో తిష్ట వేయగలుగుతుంది. మేయర్ పదవిని దక్కించుకునే అవకాశాలు తెలుగుదేశం లేదా వైసిపిలకు మాత్రమే ఉంది. ఈ రెండు పార్టీలు మేయర్ అభ్యర్థులను ముందుగానే ప్రకటించేసాయి. తెలుగుదేశం మేయర్ అభ్యర్థిగా డాక్టర్ జడ్. శివప్రసాద్, వైయస్సార్ కాంగ్రెస్ మేయర్ అభ్యర్థిగా షేక్ అబ్దుల్ అజీజ్ రంగంలో వున్నారు. దేశం మేయర్ అభ్యర్థి 8వ డివిజన్ నుండి, వైసిపి మేయర్ అభ్యర్థి 52వ డివిజన్ నుండి పోటీలో వున్నారు.

టీడీపీ, వైసిపిల మధ్యే ప్రధాన పోటీ ఉంది. ఎక్కువ డివిజన్‌లలో ఈ రెండు పార్టీల మధ్య నువ్వా-నేనా అన్నట్లు పోటీ వుంది. దాదాపు 10డివిజన్‌లలో కాంగ్రెస్ అభ్యర్థులు ప్రభావం చూపే అవకాశముంది. సీపీఎం నాలుగు డివిజన్‌లలో, బీజేపీ మూడు డివిజన్‌లలో ప్రభావం చూపుతున్నాయి.

ఏ పార్టీకైనా మేయర్ సీటును దక్కించుకోవడానికి మెజార్టీ మార్క్ సీట్లు 28 రావాలి. కాని ప్రస్తుతం నగరంలో నెలకొన్న వాతావరణం చూస్తుంటే తెలుగుదేశానికి గాని, వైయస్సార్సీపీకి గాని ఆ మెజార్టీ మార్క్ దాటే పరిస్థితి కనిపించడం లేదు. ఈ రెండు పార్టీలకు పోటాపోటీగా సీట్లు రావచ్చు. దీంతో మేయర్ అభ్యర్థి ఎంపికలో

(మిగతా 10వ పేజీలో)




కుదరని పొత్తులు

# కమలం లేకుంటే కష్టమే!




**వచ్చే ఎన్నికల్లో కమలంతో కలిసి కొనసాగాలని, నరేంద్ర మోడీ ఇమేజ్‌ను ఓట్లుగా మలచుకోవాలని ఆశపడుతున్న చంద్రబాబు ఆలోచనలకు గండి పడుతుంది.**

తెలుగుదేశంతో పొత్తుకు బీజేపీయే ఇష్టం చూపడం లేదు. నరేంద్ర మోడీ ఇమేజ్‌పై అతిగా ఆశలు పెంచుకున్న కమలం పార్టీ వాళ్లు దేశంతో పొత్తు లేకుండా ఒంటరిగా పోటీ చేయడానికే సిద్ధపడుతున్నారు. దీనికి కారణం పవన్ కల్యాణ్ స్థాపించిన జనసేనతో పాటు జయప్రకాశ్ నారాయణ లోక్‌సత్తా పార్టీ కూడా బీజేపీతో పొత్తుకు మొగ్గు చూపడమే.

చంద్రబాబు చాలాకాలం నుండి బీజేపీతో పొత్తుకు తంటాలు పడుతున్నారు. ప్రజలలో నరేంద్ర మోడీ ఇమేజ్‌ను పసిగట్టిన ఆయన బీజేపీతో పొత్తుపెట్టుకోవడం ద్వారా ఆ ఇమేజ్‌ను ఓట్లుగా మార్చుకోవాలనుకున్నాడు. బీజేపీని అడ్డం పెట్టుకునే రాష్ట్ర విభజనను అడ్డుకోవాలని చంద్రబాబు తీవ్రంగా ప్రయత్నించాడు. బీజేపీ వల్ల పార్లమెంటులో టీ-బిల్లుకు బ్రేకు పడివుంటే ఆ పని చంద్రబాబు చేయించాడని చెప్పి ఆ ఖ్యాతి ఆయనకే వచ్చి ఉండేది. దీంతో సీమాంధ్రలో చంద్రబాబు ఇమేజ్ పెరిగి ఉండేది. అయితే చంద్రబాబు ఒకటి ఊహిస్తే బీజేపీ పార్లమెంటులో ఇంకొకటి చేసింది. దీంతో సీమాంధ్రలో నరేంద్ర మోడీ ఇమేజ్ కంటే టీ-బిల్లుకు మద్దతునిచ్చిన బీజేపీపై కోపమే ఎక్కువ ప్రభావం చూపబోతుంది. టీ-బిల్లు ఆమోదం తర్వాత బీజేపీతో పొత్తు పెట్టుకునే (మిగతా 10వ పేజీలో)

ఒంగోలు

# వై.వి.సుబ్బారెడ్డికే!



**ఒంగోలు లోక్‌సభ వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ టిక్కెట్ జగన్ చిన్నాన్న, దివంగత మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి తోడల్లుడు వై.వి.సుబ్బారెడ్డికి ఖరారు చేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తుంది.**

సుబ్బారెడ్డి సొంతూరు ప్రకాశం జిల్లా మేదరమెట్ల. కాబట్టి ఒంగోలు ఆయన సొంత లోక్‌సభ నియోజకవర్గమవుతుంది. మొదటి నుండి ఆయనకు ఒంగోలు నుండే పోటీ చేయాలన్న ఆలోచన ఉన్నా జగన్ నిర్ణయం మేరకే నడుచుకోవాలనుకున్నారు. దానివల్లే ఒంగోలు సీటు కోసం ఒత్తిడి చేయలేదు.

వై.యస్. మరణం తర్వాత జగన్‌కు సుబ్బారెడ్డే అండగా నిలిచాడు. సొంత చిన్నాన్న కాంగ్రెస్‌లో ఉన్నా సుబ్బారెడ్డి కష్టకాలంలో తోడుగా నిలిచాడు. జగన్ పార్టీ ఏర్పాటులోనూ, రాష్ట్ర వ్యాప్తంగా పార్టీలోకి నాయకులను తీసుకురావడంలోనూ కీలకపాత్ర పోషించారు. జగన్ జైలులో వున్న కాలంలో పార్టీ కేడర్ చెదిరిపోకుండా అన్ని నియోజకవర్గాల నాయకులతో టచ్‌లో వుంటూ వారిలో ధైర్యం కల్పించారు. రేపటి ఎన్నికల్లో జగన్ ఏ బాధ్యతలు అప్పగించినా నిర్వర్తించడానికి సిద్ధపడ్డారు. జగన్ ఆయనకు సొంత లోక్‌సభ బాధ్యతలే అప్పగించారు.

ఆల్‌రెడీ ప్రకాశం జిల్లా పార్టీ బాధ్యతలంతా బాలినేని శ్రీనివాసరెడ్డి చూస్తున్నారు. బాలినేనికి వై.వి.సుబ్బారెడ్డి సొంత బావ అవుతారు. తన బావను గెలిపించుకోవడం బాలినేనికి పెద్ద సమస్య కూడా కాదు.



## హస్తం వద్దంటున్న కేడర్
# కాంగ్రెస్‌ను వదలనంటున్న లీడర్



**ఆత్మకూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులకు పెద్ద చిక్కు వచ్చిపడింది. కాంగ్రెస్‌పార్టీ జెండాతో హస్తం గుర్తు పెట్టుకుని పల్లెల్లోకి పోతే జనం తరుముకుంటున్నారు. మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి వద్దకుపోయి తమ పరిస్థితి చెప్పుకుంటే మీ చావు మీరు చావండి... మీరు ఏం చేస్తారో, ఎలా చేస్తారో నాకు తెలియదు, మీ ఎంపీటీసీలను, జడ్పీటీసీలను గెలిపించుకురండి అని పల్లెల్లోకి తరుముతున్నాడు. దీంతో ఇటు మంత్రి అటు జనం మధ్య ఆత్మకూరు కాంగ్రెస్ నాయకులు నలిగిపోతున్నారు.**

2009ఎన్నికలలో ఆత్మకూరు నుండి ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేయడం ఈ నియోజకవర్గ ప్రజల అదృష్టం. నియోజకవర్గాల పునర్విభజన ఆత్మకూరు అభివృద్ధి కోసమే జరిగినట్లుంది. లేదంటే ఆయన మళ్ళీ రాపూరు నుండే పోటీచేసి ఉండేవాడు. మొదట ఒకటిన్నర సంవత్సరం మున్సిపల్ మంత్రిగా వున్నా తర్వాత ఆర్థికమంత్రి కావడంతో ఆత్మకూరు సుడి తిరిగింది. ఆర్థికమంత్రిగా ఆత్మకూరుకు కుప్పలుతెప్పలుగా నిధులు తెచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాడు. అభివృద్ధిని చూపించి ఓటడిగే హక్కు ఆనం రామనారాయణరెడ్డికి నూటికి నూరుశాతం ఉంది.

అయితే కాంగ్రెస్ తీసుకున్న రాష్ట్ర విభజన నిర్ణయంతో ఆనం చేసిన అభివృద్ధంతా బూడిదలో పోసిన పన్నీరయ్యింది. ఆ అంశమే మరుగునపడిపోయింది. కాంగ్రెస్ అంటేనే ప్రజలు మండిపడే పరిస్థితి వచ్చింది. హస్తం గుర్తు అంటేనే ఓట్లేసేటట్లు లేరు.

ఇప్పుడు జడ్పీ ఎన్నికల్లో ఆత్మకూరు కాంగ్రెస్ నాయకులకు అదే సమస్యగా మారింది. గత ఏడాది చివర్లో జరిగిన సహకార ఎన్నికల్లోనూ, ఆ తర్వాత జరిగిన పంచాయితీ ఎన్నికల్లోనూ ఆత్మకూరు నియోజకవర్గంలో ఆనం వర్గమే పైచేయి సాధించింది. అయితే ఆరోజుకు రాష్ట్ర విభజన జరగలేదు. అదీగాక ఆ ఎన్నికలు పార్టీలతో సంబంధం లేకుండా ఇతర గుర్తుల మీద జరిగాయి. కాని ఇప్పుడు సీన్ మారింది. విభజనతో జనం కాంగ్రెస్ పై కారాలు మిరియాలు నూరుతున్నారు. ఇప్పుడు జడ్పీ ఎన్నికలు పార్టీల గుర్తులతోనే జరుగుతున్నాయి. గ్రామాల్లో జనం తెలుగుదేశానికైనా ఓటేస్తామంటున్నారు గాని హస్తంవైపు కన్నెత్తి కూడా చూడబోమంటున్నారు. దీంతో ఆత్మకూరు కాంగ్రెస్ నాయకులంతా తెలుగుదేశంతో మ్యాచ్‌ఫిక్సింగ్ ఏర్పాటు చేసుకుని సైకిల్ గుర్తు మీద ఉమ్మడి అభ్యర్థులను నిలబెట్టాలనుకున్నారు. ఇదే ప్రతిపాదనను ఆనం వద్దకు తీసుకెళ్లారు. అయితే దీనికి ఆయన ఒప్పుకోలేదు. ఈరోజు కేడర్ అంతా తెలుగుదేశం సింబల్ మీద పోటీచేస్తే అక్కడే సర్దుకుపోతారేమోననేది ఆనం భయం. అందుకే ఆయన సైకిల్ గుర్తు వద్దంటున్నారు. నాయకులు మాత్రం హస్తం గుర్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేదానికంటే ఇంట్లో కూర్చోవడం మేలనే ధోరణిలో ఉన్నారు.

# ఉదయగిరిలో బలపడిన 'దేశం'



**ఉదయగిరి ఒకప్పుడు కాంగ్రెస్‌కు కంచుకోట. తెలుగుదేశం పార్టీని పెట్టాక ఆ పార్టీ అభ్యర్థి ఇక్కడ అధికారికంగా గెలిచింది ఒకే ఒకసారి. 1983 నుండి తీసుకుంటే ఎన్నికల పరంగా కాంగ్రెస్‌దే పైచేయి అయ్యింది.**

వై.యస్. మరణానంతరం తలెత్తిన పరిణామాలతో కాంగ్రెస్ స్థానంలో ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఉంది. ఏడాది క్రితం ఉదయగిరి అసెంబ్లీకి ఉపఎన్నికలు జరిగితే వైకాపా అభ్యర్థి మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి 30వేల ఓట్ల తేడాతో గెలిచారు. ఆరోజు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఆయన పట్ల వ్యతిరేకత వున్నా జగన్ ఇమేజ్ బలంగా పనిచేసింది. నిన్నటివరకు ఇక్కడ తెలుగుదేశం కోలుకోలేని పరిస్థితి ఉండింది. అలాంటి నియోజకవర్గంలో తెలుగుదేశంపార్టీ అనూహ్యంగా పుంజుకుంది. ఈ నియోజకవర్గంలో ఊహించని పరిణామాలు చోటుచేసుకున్నాయి. తెలుగుదేశంలో చేరిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి ముందుగా ఉదయగిరిపై దృష్టి పెట్టాడు. రాజన్నదళం పెట్టి మేకపాటికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్న మాజీజడ్పీటీసీ మెట్టుకూరు చిరంజీవిరెడ్డిని తెలుగుదేశంలోకిలాగారు. జలదంకిలో కావేరి కృష్ణారెడ్డిని పార్టీలో చేర్చారు. మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డిని కూడా పార్టీలోకి తీసుకొచ్చారు. వింజమూరు మండలంలోనూ కొందరు ద్వితీయశ్రేణి నాయకులను తెలుగుదేశంలో చేర్చారు. దీంతో నియోజకవర్గంలో తెలుగుదేశం ఉన్నట్లుండి పెరిగింది. మొన్నటివరకు నియోజకవర్గంలోని 8మండలాలలో వైసిపి బలంగా ఉండింది. ఈరోజు 6మండలాలలో వైసిపి, టీడీపీ నువ్వా-నేనా అన్నట్లుగా తలపడుతున్నాయి.

## 'దేశం'లోకి...
# మాగుంట శీనయ్య?



**ఆర్టీసీ బస్టాండ్‌లో పల్లెవెలుగు బస్సు ఆగగానే పొలోమంటూ ప్రయాణీకులు ఎగబడి కిటికీల్లో నుండి కండువాలు, కర్చీఫ్‌లు వేసి తమ సీట్లను రిజర్వ్ చేసుకుంటుంటారు. ఇప్పుడు రాజకీయ పార్టీలలో సీట్ల పరిస్థితి కూడా అలాగే వుంది. అడ్వాన్స్ బుకింగ్ చేసుకుని ముందుగా రిజర్వు చేసుకున్న వాళ్ళకే లోక్‌సభ సీట్లయినా, శాసనసభ టిక్కెట్లయినా!**

ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి లాంటి నాయకులు ఎంతోముందుచూపుతో వ్యవహరించి తెలుగుదేశంలో అడ్వాన్స్ బుకింగ్ ద్వారా తమ సీట్లను రిజర్వ్ చేసుకున్నారు. దీంతో వాళ్లకు సీట్లు గ్యారంటీ వచ్చింది. ఒంగోలు మాజీఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఈ కోవలోనే ఒంగోలు సీటుపై కర్చీఫ్ వేసి రిజర్వ్ చేసుకున్నట్లుగా తెలుస్తుంది. మొన్నటిదాకా ఆయన ఏ పార్టీలో చేరాలనేదానిపై సందిగ్ధంలో పడ్డారు. ఏ పార్టీలో చేరితే ఎలా వుంటుందనే దానిపై అనుచరులద్వారా సర్వేలు కూడా చేయించుకున్నారు. ఆయన నిర్ణయం తీసుకునేలోపే వైయస్ కాంగ్రెస్‌పార్టీలో టిక్కెట్లు అయిపోయాయి. ఇక తెలుగుదేశంపార్టీ తప్పితే ప్రత్యామ్నాయం లేదు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 28వ తేదీ ఆయన తెలుగుదేశంపార్టీలో చేరుతున్నట్లుగా గట్టి సమాచారం అందింది.

# తప్పుకున్న కంభం... పోటీలో వేనాటి!



జిల్లా పరిషత్ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థులుగా కంభం విజయరామిరెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డిలు తలపడడం జరిగింది. కంభం విజయరామిరెడ్డి కొండాపురం నుండి, వేనాటి రామచంద్రారెడ్డి సూళ్లూరుపేటల నుండి నామినేషన్లు వేసారు. వీరిద్దరినీ ఆర్థికంగా తూకం వేసారు. ఆర్థికపరంగా కంభం వెనక్కి తగ్గడంతో వేనాటి రామచంద్రారెడ్డినే జడ్పీ ఛైర్మెన్ అభ్యర్థిగా నిర్ణయించారు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా

**అమ్మ ఫర్నిచర్ మాల్**

మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.

Latest & New Models

ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## స్థలములు & ఇల్లు అమ్మబడును

భవానినగర్, కోవూరులో DTCP హైదరాబాద్ వారి అనుమతి పొందిన లే అవుట్ నందు అన్ని వసతులతో, అన్ని ఫేసులలో ఇండ్ల ప్లాట్లు మరియు ఒక డూప్లెక్స్ హౌస్ నార్త్ ఈస్ట్ కార్నర్ తూర్పు ఫేసింగ్ కలది అమ్మకమునకు కలవు.

కావలసినవారు సంప్రదించండి :

**94415 23251, 99892 87971.**


- క్లైమాక్స్‌కు చేరిన ప్రచారం

# హోరాహోరీగా తలపడుతున్న అభ్యర్థులు

రేపు సార్వత్రిక ఎన్నికలు ఏ విధంగా ఉండబోతున్నాయో ముందుగానే సూచించే మున్సిపల్ ఎన్నికలకు ముహూర్తం దగ్గరపడింది. నెల్లూరునగర పాలకసంస్థతో పాటు కావలి, గూడూరు, వెంకటగిరి, ఆత్మకూరు, నాయుడుపేట, సూళ్లూరుపేటలలో ప్రచారం హోరెత్తింది. 28వ తేదీతో ప్రచారం ముగిసింది కూడా! 30వ తేదీ పోలింగ్, ఏప్రిల్ 2వ తేదీ ఫలితాల ద్వారా ఎవరి జాతకాలేంటో బయటపడతాయి.

నెల్లూరు నగరం పదిరోజులుగా అభ్యర్థుల ప్రచారంతో దద్ధరిల్లింది. వివిధ పార్టీల టిక్కెట్లు దొరికిన అభ్యర్థులు, టిక్కెట్లు దొరక్క రెబల్స్‌గా వేసినవాళ్లు, ఇండిపెండెంట్లు ఇలా అందరూ ప్రచారపర్వాన్ని ఉధృతంగా సాగించారు. అయితే ఈసారి అభ్యర్థులు ఆడంబరప్రచారం, ర్యాలీలు వంటివాటికంటే ఇంటింటి ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. ప్రతి ఓటరును స్వయంగా కలిసి ఓట్లు అడిగారు. చాలా డివిజన్‌లలో పార్టీలకంటే అభ్యర్థుల పనితీరు, వారి వ్యక్తిత్వమే ఫలితాలపై ప్రభావం చూపిస్తుంది. ఇక అన్ని పార్టీల వాళ్లు కూడా ఎంపిక చేసుకున్న ప్రాంతాలలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసారు. చీరలు, ముక్కుపుడకలు వంటివి పంపిణీ చేసారు. అభ్యర్థుల తరపున ఆయా పార్టీల పెద్దనాయకులు ప్రచారం నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో మద్యం ఏరులైపారుతుంది. నగరంలో పెద్దఎత్తున పార్టీల ఆఫీసులను ఏర్పాటుచేసి ఉన్నారు.

గూడూరు, కావలి, సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేట మున్సిపాల్టీలలో ప్రచారం ఉధృతంగా సాగింది. అయితే అన్ని మున్సిపాల్టీలలో వైకాపా, తెదేపాల మధ్యే ప్రధాన పోటీ ఉంది.



ప్రచారంలో దేశం మేయర్ అభ్యర్థి డా॥ జడ్.యస్.



వైయస్సార్సీపీ అభ్యర్థికి మద్దతుగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి



బీజేపీ అభ్యర్థికి మద్దతుగా జిల్లా అధ్యక్షులు సురేంద్రరెడ్డి ప్రచారం



కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారంలో మాజీమేయర్ భానుశ్రీ

# నగర బరి... హోరాహోరీ

*నెల్లూరు నగరపాలక సంస్థ రెండోసారి ఎన్నికలకు ముస్తాబయ్యింది. నెల్లూరు మున్సిపాలిటీ నగరపాలకసంస్థగా ఆవిర్భవించాక 2005లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ మేయర్ పదవిని చేజిక్కించుకుంది. అయితే ఆరోజు హోరాహోరీ పోరు జరిగింది. కాంగ్రెస్ కంటే తెలుగుదేశంకే ఒక డివిజన్ ఎక్కువుగా వచ్చింది. కాని ఇండి పెండెంట్లు, సీపీఎం, కో–ఆప్షన్ సభ్యుల మద్దతుతో కాంగ్రెస్ మేయర్ పదవిని హస్తగతం చేసుకుంది.*

మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ ఎన్నికల్లో ప్రధాన పోటీ తెలుగుదేశం, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీల మధ్యే నెలకొంది. వైసిపికి ఇవి తొలి ఎన్నికలు. ఇక తెలుగుదేశం మేయర్ అభ్యర్థిగా డాక్టర్ జడ్.శివప్రసాద్, వైకాపా మేయర్ అభ్యర్థిగా అబ్దుల్ అజీజ్ రంగంలో ఉన్నారు. దేశం మేయర్ అభ్యర్థి డాక్టర్ జడ్.శివప్రసాద్‌కు నగరంలో విస్తృత పరిచయాలుండడంతో పాటు వివాదరహితుడిగా పేరుంది. వైసిపి మేయర్ అభ్యర్థి అబ్దుల్ అజీజ్ మైనార్టీ వర్గానికి చెందినవారు. వ్యాపారవేత్త. మైనార్టీ వర్గాలలో ఆయన అభ్యర్థిత్వం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.

**ఇక నగరపాలకసంస్థలో 54డివిజన్‌లు ఉంటే కొన్నింటిలో ముఖాముఖీ పోటీ, మరికొన్నింటిలో త్రిముఖపోటీ, ఒకటి అరా చోట్ల చతుర్ముఖపోటీ కూడా ఉంది.**

*1వ డివిజన్ :* ఇక్కడ దేశం, కాంగ్రెస్, వైసిపిల మధ్య త్రిముఖ పోటీ నెలకొని వుంది. వైసిపి, కాంగ్రెస్ అభ్యర్థులిద్దరూ గట్టోళ్లే. దేశం అభ్యర్థి బలహీనవర్గాలకు చెందిన వ్యక్తి. కాంగ్రెస్ అభ్యర్థి గట్టి నాయకుడే అయినా పార్టీ మైనస్. వైసిపి అభ్యర్థికి రాజకీయ అనుభవం, పరిచయాలు కలిసొస్తున్నాయి.

*2వ డివిజన్ :* ఇక్కడ ప్రధానపోటీ తెలుగు దేశం, వైసిపి అభ్యర్థుల మధ్యే నెలకొనివుంది. స్థానికంగా వున్న మంచిపేరుతో దేశం అభ్యర్థి కాస్త ముందంజలో ఉన్నట్లు సమాచారం.

*3వ డివిజన్ :* తెలుగుదేశం, కాంగ్రెస్‌ల మధ్య ప్రధానపోటీ నడుస్తుంది. వైసిపి అభ్యర్థి మూడో స్థానంలో వుంది. ఇండిపెండెంట్‌గా పోటీ చేసిన సంక్రాంతి అశ్వినీయాదవ్ వైసిపి ఓట్లకు గండిపెట్టింది.

*4వ డివిజన్ :* తెలుగుదేశం ముందంజలో వుంది. వైసిపి అభ్యర్థి స్థానికేతరుడు కావడం మైనస్. కాంగ్రెస్ అభ్యర్థికి స్థానికంగా బల మున్నప్పటికీ పార్టీ మైనస్. వైసిపి రెబల్స్ వైదొలగ డంతో చివర్లో బలంపుంజుకున్నాడు.

*5వ డివిజన్ :* ఇక్కడ తెలుగుదేశం, వైసిపి, సీపీఎం అభ్యర్థుల మధ్య త్రిముఖ పోటీ కని పిస్తుంది. సీపీఎంకు గట్టి పట్టున్న డివిజన్ కావడంతో అటుగా కొంచెం మొగ్గుంది. లేదంటే వైసిపికి అవకాశముంటుంది.

*6వ డివిజన్ :* నెల్లూరు నగరంలో హోరా హోరీ పోరు జరుగుతున్న డివిజన్ ఇది. తెలుగు దేశంకు మొదటి నుండి బలమైన డివిజన్ ఇది. అయితే వైసిపి అభ్యర్థికి స్థానికంగా వున్న పరి చయాలు, ముందు నుండే ప్రచారానికి దిగి వుండడంతో గట్టిపోటీనివ్వగలుగుతున్నారు.

*7వ డివిజన్ :* తెలుగుదేశం, వైకాపాల మధ్యే ప్రధాన పోటీ వున్నప్పటికి స్థానికంగా వున్న టీడీపీ సంప్రదాయఓట్లు, కులసమీకరణల ఓట్లతో దేశమే ముందంజలో ఉంది.

*8వ డివిజన్ :* దేశం మేయర్ అభ్యర్థి ఇక్కడ నుండే పోటీ చేస్తున్నారు. ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి సొంత డివిజన్. వైసిపి, కాంగ్రెస్‌లో కొంతవరకు పోటీనిచ్చినా తెలుగుదేశంకే ఇది అనుకూలంగా ఉంటుంది.

*9వ డివిజన్ :* దేశం అభ్యర్థి కొంత వెనుక బడినట్లుగా కనిపిస్తుంది. వైసిపికి కొంత మొగ్గు కనిపిస్తుంది. ప్రధానపోటీ దేశం, వైకాపాల మధ్యనే.

*10వ డివిజన్ :* టీడీపీ, వైసిపిల మధ్య ముఖాముఖి పోటీవుంది. దేశంకే మొగ్గు కనిపిస్తుంది.

*11వ డివిజన్ :* దేశం, వైసిపిల మధ్య గట్టిపోటీ వుంది.

*12వ డివిజన్ :* త్రిముఖ పోటీ నెలకొని వుంది. కాంగ్రెస్, దేశం, వైసిపి అభ్యర్థులు ముగ్గురు గట్టివాళ్లే. కాంగ్రెస్‌కే కొంత మెరుగ్గా ఉంది.

*13వ డివిజన్ :* దేశం, వైసిపిల మధ్యే ముఖాముఖి పోటీ వుంది. దేశంకే అనుకూ లంగా వుంది.

*14వ డివిజన్ :* దేశం, కాంగ్రెస్, వైసిపిల మధ్య త్రిముఖ పోటీ ఉన్నప్పటికీ స్థానికంగా వున్న పరిచయాలతో దేశంకే విజయావకాశాలున్నాయి.

*15వ డివిజన్ :* ఇక్కడా మూడు పార్టీల మధ్య త్రిముఖపోటీ వుంది. కాంగ్రెస్ అభ్యర్థికి స్థాని కంగా పరిచయాలున్నప్పటికీ పార్టీ వ్యతిరేకత ప్రతికూలంగా ఉంది.

*16వ డివిజన్ :* టీడీపీ, వైసిపి అభ్యర్థులు నువ్వా–నేనా అన్నట్లున్నారు. సీపీఎం కూడా గట్టి పోటీలో ఉంది.

*17వ డివిజన్ :* త్రిముఖపోటీ ఉంది. వైసిపి అభ్యర్థికే మొగ్గున్నట్లు కనిపిస్తుంది.

*18వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్యనే పోటీ ఉంది. వైసిపి కొంచెం ముందంజలో వున్నట్లు తెలుస్తుంది.

*19వ డివిజన్ :* తెలుగుదేశం, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ జరుగుతున్నట్లు తెలుస్తుంది. తెలుగుదేశంకు మెరుగ్గా వుంది. వైసిపి అభ్యర్థి పట్ల వ్యతిరేకత కనిపిస్తుంది.

*20వ డివిజన్ :* కాంగ్రెస్ అభ్యర్థి, ఇండి పెండెంట్ అభ్యర్థి మేకల నరేంద్రల మధ్యే ప్రధానపోటీ నడుస్తుంది. వైసిపి, టీడీపీలు 3, 4 స్థానాలలోకి వెళ్లే అవకాశముంది.

*21వ డివిజన్ :* త్రిముఖపోటీ ఉంది. తెలుగుదేశం, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య నువ్వా–నేనా అన్నట్లు పోటీ నడుస్తుంది.

*22వ డివిజన్ :* టీడీపీ, వైసిపి, బీజేపీల మధ్య త్రిముఖపోటీ ఉంది. టీడీపీకే కొంత మెరుగ్గా వుంది.

*23వ డివిజన్ :* టీడీపీ, బీజేపీల మధ్య ప్రధానపోటీ నడుస్తుంది. బీజేపీకే అవకాశాలు ఉన్నట్లుంది.

*24వ డివిజన్ :* టీడీపీ, సీపీఎంల మధ్య పోటీ వుంది. సీపీఎంకే మొగ్గుంది.

*25వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్య ప్రధానపోటీ వుంది. వైసిపికే మొగ్గు కనిపిస్తుంది.

*26వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్యే ముఖ్య పోటీ. వైసిపికే కాస్త అనుకూలం.

*27వ డివిజన్ :* త్రిముఖ పోటీ ఉంది. టీడీపీకే విజయావకాశాలున్నాయి.

*28వ డివిజన్ :* ముక్కోణపు పోరు జరుగుతుంది. టీడీపీ అభ్యర్థికే మెరుగ్గా వుంది.

*29వ డివిజన్ :* టీడీపీ అభ్యర్థి లేరు. ముగ్గురు ఇండిపెండెంట్లు, ఒక వైసిపి అభ్యర్థి బలంగా ఉన్నారు. ఇండిపెండెంట్లలో ఒకరు గెలిచే అవకాశముంది.

*30వ డివిజన్ :* టీడీపీ, వైసిపి, బీజేపీల మధ్య ముక్కోణపు పోటీ వుంది. వైసిపికే అవ కాశముంది.

*31వ డివిజన్ :* టీడీపీ, వైసిపిల మధ్యే ప్రధానపోరు. టీడీపీకే మొగ్గుంది.

*32వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్యే పోటీ వుంది. వైసిపి ముందంజలో వుంది.

*33వ డివిజన్ :* టీడీపీ, బీజేపీ, వైసిపిల మధ్య త్రిముఖపోటీ. బీజేపీ అభ్యర్థికే మెరుగైన అవకాశాలున్నాయి.

*34వ డివిజన్ :* టీడీపీ, వైసిపిల మధ్య గట్టిపోటీ వుంది. టీడీపీకి కొంచెం మొగ్గుంది.

*35వ డివిజన్ :* టీడీపీకి రెబల్ బెడద వుంది. లేకుంటే టీడీపీకే మెరుగ్గా ఉండేది. వైసిపి నుండి గట్టిపోటీ ఎదుర్కొంటుంది.

*36వ డివిజన్ :* టీడీపీ, కాంగ్రెస్‌ల మధ్య గట్టిపోటీ వుంది. కాంగ్రెస్ అభ్యర్థికే అవకాశా లున్నాయి.

*37వ డివిజన్ :* మాజీమేయర్ భానుశ్రీ సొంత డివిజన్. కాంగ్రెస్, వైసిపి, టీడీపీల మధ్య ముక్కో ణపు పోటీ వుంది. దేశం అభ్యర్థి ముందంజలో ఉన్నారు.

*38వ డివిజన్ :* ప్రధానపోటీ వైసిపి, టీడీపీల మధ్యే. వైసిపికే విజయావకాశాలు.

*39వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్య గట్టిపోటీ. టీడీపీకే కొంత అవకాశాలు మెరుగ్గా ఉన్నాయి.

*40వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్య ప్రధాన పోటీ. వైసిపికే మొగ్గుంది.

*41వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్యే ముఖాముఖి పోరు. వైసిపికే ఛాన్సుంది.

*42వ డివిజన్ :* వైసిపి, కాంగ్రెస్, ఇండి పెండెంట్ ఇంతియాజ్‌ల మధ్యే ప్రధానపోటీ. వైసిపికి అవకాశముంది.

*43వ డివిజన్ :* వైసిపి, కాంగ్రెస్‌ల మధ్యే ప్రధానపోరు. వైసిపికే అవకాశముంది.

*44వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్యే ప్రధాన పోటీ. వైసిపికే ఛాన్సుంది.

*45వ డివిజన్ :* వైసిపి, కాంగ్రెస్‌ల మధ్యే పోటీ. వైసిపికే మొగ్గుంది.

*46వ డివిజన్ :* కాంగ్రెస్, వైసిపి, టీడీపీల మధ్య త్రిముఖ పోటీ వుంది. కాంగ్రెస్‌కే అవ కాశాలున్నాయి.

*47వ డివిజన్ :* టీడీపీ, కాంగ్రెస్‌ల మధ్య నువ్వా–నేనా అన్నట్లుంది. టీడీపీకే అవకాశముంది.

*48వ డివిజన్ :* టీడీపీ, సీపీఎంల మధ్యే గట్టిపోటీ వుంది. టీడీపీకి అవకాశముంది.

*49వ డివిజన్ :* వైసిపి, టీడీపీల మధ్య గట్టి పోటీ. వైసిపికి మెరుగ్గా వున్నట్లు తెలుస్తుంది.

*50వ డివిజన్ :* టీడీపీ, బీజేపీల మధ్యే ప్రధానపోటీ నెలకొంది. చెరిసమాన అవకాశా లున్నాయి.

*51వ డివిజన్ :* టీడీపీ, వైసిపిల మధ్యే గట్టి పోటీ వుంది. టీడీపీదే పైచేయిగా వుంది.

*52వ డివిజన్ :* వైసిపి మేయర్ అభ్యర్థి పోటీ చేస్తున్న డివిజన్. కాంగ్రెస్, టీడీపీలు గట్టి పోటీ ఇస్తున్నప్పటికి వైసిపికే అవకాశముంది.

*53వ డివిజన్ :* టీడీపీ, వైసిపి, సీపీఎంల మధ్య ముక్కోణపు పోటీ వుంది. టీడీపీకే మొగ్గు కనిపిస్తుంది.

*54వ డివిజన్ :* టీడీపీ, వైసిపిల మధ్య పోటీ నెలకొనివుంది. అవకాశాలు సమంగా ఉన్నాయి.

నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల పరిధిలో 54డివిజన్లు ఉన్నాయి. నగర పరిధిలో తెలుగుదేశం పరిస్థితి మెరుగ్గా వుండగా, రూరల్ పరిధిలోని డివిజన్‌లలో వైసిపిది పైచేయిగా ఉండడం విశేషం.

జగన్ ప్రభావం బలంగా పనిచేస్తే టీడీపీకి అవకాశమున్న చోట్ల కూడా గల్లంతయ్యే పరిస్థితి వుంది. ఈ ఎన్నికలను స్థానిక అంశాలు, డివిజన్‌లకు పోటీ చేసిన అభ్యర్థుల వ్యక్తిగత సామర్థ్యం, కులం, మతం, ఆర్థికం వంటి అంశాలు ప్రభావితం చేస్తున్నాయి. కాబట్టే టీడీపీ, వైసిపిల మధ్య నువ్వా–నేనా అన్నట్లుగా పోటీవుంది.

## నిత్యం మీతోనే ఉంటా...

# నిస్వార్థంగా సేవలందిస్తా!

**- మనోహర్‌రెడ్డి**



కార్పొరేటర్లు అంటే కాంట్రాక్టర్లు కాదని, నిత్యం ప్రజలకు అందు బాటులో వుండాలని 29వ డివిజన్ నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో ఉన్న బసివిరెడ్డి మనోహర్‌రెడ్డి (మైథిలి మనోహర్‌రెడ్డి) పేర్కొన్నారు. గత 10రోజులుగా ఆయన 29వ డివిజన్ పరిధిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తు న్నారు. ఇంటింటికి వెళ్లి తన ఆశయాలను, ఆ డివిజన్ పరిధిలో తాను చేయాలనుకుంటున్న పనులను విపులంగా వివరిస్తున్నారు.




విద్యావంతుడైన మనోహర్‌రెడ్డికి స్థానికులు ఘనస్వాగతం పలుకుతున్నారు. తమ మద్దతు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా మనోహర్‌రెడ్డి తాను కార్పొరేటర్‌గా ఎన్నికైతే ఏమేం చేయాలనుకుంటున్నది ప్రజలకు వివరించారు. డివిజన్‌లోని అన్ని వీధుల్లో నాణ్యమైన రోడ్ల నిర్మాణంతో పాటు డ్రైనేజీ పనులు నాణ్యంగా జరిగేందుకు కృషి చేస్తానని చెప్పారు. నెల్లూరు నగరం దోమలకు పెట్టనికోటగా మారిం దని, ఈ దోమలతో ప్రజలు వివిధ రోగాల బారినపడుతూ నరకయాతన అనుభవిస్తున్నారని, డివిజన్‌ను క్లీన్ అండ్ గ్రీన్‌గా వుంచి దోమల నిర్మూలనకు కృషి చేస్తానన్నారు. పారిశుద్ధ్యం, మంచినీటి సమస్యలపై ప్రధానంగా దృష్టి పెడతానన్నారు.



డివిజన్‌లో ప్రజలకు మున్సిపాలిటీ పరంగా అవసరమైన బర్త్ సర్టిఫికెట్లు, డెత్ సర్టిఫికెట్లు, ఇతరత్రా పత్రాల కోసం డివిజన్‌లోనే ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటుచేసి అర్జీలు స్వీకరిస్తా మని, వారికి అవసరమైన సేవలను సత్వరం అందేలా చేస్తా నన్నారు. 29వ డివిజన్ ప్రజలు తనను ఆదరించి గెలిపిస్తే నిత్యం ఇక్కడే వుంటూ నిస్వార్థంగా సేవలందిస్తానని ఆయన పేర్కొన్నారు.

మనోహర్‌రెడ్డి వెంట ప్రచార కార్యక్రమంలో జిల్లా ప్రజావాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సి.భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బిరదవోలు రామిరెడ్డి, అసోసియేట్ అధ్యక్షులు ఏ.రామకృష్ణయ్య, కోశాధికారి ఒ.సుబ్బరాయుడు, టి.వి. రమణయ్య, సి.హెచ్.లక్ష్మీప్రసాద్, యం.విశ్వనాథరావు, బి.ఆర్.శ్రీధర్, యం.సుధాకర్‌రెడ్డి, డి.మస్తానయ్య, టి.వెంకయ్య, డి.ఎస్తేరు, రాణమ్మ తదితరులు పాల్గొన్నారు.






## మంచినేతను ఎన్నుకోండి!

చంద్రబాబు పార్టీ అంటే ఇష్టం లేకున్నా, ఆ పార్టీపై వ్యతిరేకత ఉన్న వారు సైతం నెల్లూరు తెలుగుదేశం మేయర్ అభ్యర్థిగా నిలబడిన డాక్టర్ జడ్.శివప్రసాద్‌ను మంచివాడం టుండడం అతని అదృష్టం. మీడియా పరంగానే కాకుండా సాధారణ జనవాక్యం కూడా అదే. పేదలకు ఉచితవైద్య శిబిరాల ద్వారా సేవ లందించి పసిబిడ్డలతో పాటూ పెద్దల మనసులు చూరగొన్న డాక్టర్‌గా జడ్.యస్.కు పేరు రావడం విశేషం. పార్టీలకతీతంగా నగరపారులు ఆలోచించి వ్యక్తి త్వాన్ని బట్టి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం మంచిది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

## తిరుమలకు భద్రత ఏదీ!

వందలాది ఎకరాల శేషాచలం అడవులు అగ్నికి ఆహుతి కావడం దురదృష్టకరం. తిరుమల కొండ లకు భద్రత కరువవుతుంది. అన్య మతస్తుల దృష్టి కూడా తిరుమలపై వుంది. తిరుమల పవిత్రతను, శేషా చలం పచ్చదనాన్ని కాపాడడానికి ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలి.

పంబేటి సుబ్రహ్మణ్యం, కోట.

## పవనిజం ఇదేనా?

రాష్ట్ర విభజనలో కాంగ్రెస్‌కు ఎంత బాధ్యత వుందో బిజెపికి అంతే బాధ్యత ఉంది. కాని పవన్ కల్యాణ్ ఈ విషయంలో కాంగ్రెస్‌నే తప్పు పడుతూ బిజెపితో చేతులు కల పడం దుర్మార్గమైన చర్య. గుజరాత్ అల్లర్ల ద్వారా ముస్లింల పాలిట విలన్‌గా మారిన మోడీతో చేతులు కలపడాన్ని మాలాంటి అభిమా నులు జీర్ణించుకోలేకపోతున్నారు.

ఎస్.డి.జహీర్, నెల్లూరు.


## అన్నయ్య సన్నిధి

'అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి' అంటున్నాడు 'జనసేన' అధి నేత పవన్‌కల్యాణ్. అన్నయ్య తండ్రి లాంటివాడు ఆయనకు నేనెందుకు ఎదురెళ్తాను? అన్నాడు పవన్. కాం గ్రెస్‌కు ఓటెయ్యండి అని చిరంజీవి ప్రచారం చేస్తాడు. పవన్ కాంగ్రెస్ హటావో అంటున్నాడు. చచ్చినపులి కాంగ్రెస్‌ను చంపేందుకు పవన్ హంగామా చేస్తున్నాడు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

# 'ప్రభా'తం

## విద్వేషాలు ఖాయం



***మహారాష్ట్ర నవ నిర్మాణ సమితి అధ్య క్షుడు రాజ్‌థాకరే కంటే పెద్ద ప్రమాదకారి కేసీఆర్. ఆయన ప్రాంతీయ విద్వేషపు చిచ్చుకు బలయ్యేది సీమాంధ్రులే కాదు, తెలంగాణ వాళ్లు కూడా! ఈ వాస్తవాన్ని ఆ ప్రాంత ప్రజలు గ్రహించాల్సివుంది.***

ఎవరు చేసిన తప్పుకు వాళ్ళు శిక్ష అనుభవించక తప్పదు. ఇప్పుడు కాంగ్రెస్‌పార్టీ చేసిన తప్పుకు ఆ పార్టీ శిక్ష అనుభవించాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. రాష్ట్ర విభజన వద్దు మొర్రో అని ప్రజలు ఓ పక్క, విభజనకు ఇది సరైన సమయం కాదంటూ ప్రతిపక్షాలు మరోపక్క మొత్తుకున్నా కాంగ్రెస్ అధిష్టానం చెవికెక్కించుకుందా? మీ మూర్ఖత్వం కొద్దీ విభజిస్తున్నారు సరే, అదన్నా న్యాయంగా సక్రమంగా చేయండంటే విన్నారా? చాలా అన్యాయంగా, చాలా దరిద్రంగా, అత్యంత నికృష్టంగా రాష్ట్ర విభజన చేసారు. గోహత్య మహాపాతకం అంటారు. అన్యాయమైన విభజన ద్వారా కాంగ్రెస్‌పార్టీ అంతకంటే మహాపాతకానికి ఒడిగట్టింది.

ఇంత పాపం చేసాక కూడా కాంగ్రెస్ అనుకున్న ప్రయోజనం నెరవేరిందా అంటే అదీ లేదు. కేసీఆర్ మాటలను నమ్మి కాంగ్రెస్ రాష్ట్రాన్ని అడ్డంగా నరికింది. టీఆర్‌ఎస్‌ను తమలో విలీనం చేసుకోవడానికే కాంగ్రెస్ ఈ పాపిష్టి పనికి పాల్పడింది. సిడబ్ల్యుసిలో తెలంగాణపై నిర్ణయం తీసుకున్నరోజు నుండి దిగ్విజయ్‌సింగ్ టీఆర్‌ఎస్ విలీనం పాటే పాడుతూ వచ్చాడు. కాని చివరకు జరిగిందేమిటి? కేసీఆర్ కాంగ్రెస్‌కు మొండిచేయి చూపిం చాడు. విలీనం మాట అటుంచితే కనీసం కాంగ్రెస్‌తో పొత్తుకు కూడా అతను మొగ్గుచూపలేదు. కేసీఆర్ బుద్ధి తెలిసి కూడా కాంగ్రెస్ అత నిని నమ్మి సీమాంధ్రకు అన్యాయం చేసింది. ఇప్పుడు తెలంగాణలోనూ కాంగ్రెస్‌కు అంత సీన్ లేదు. సీమాంధ్రలో అయితే హస్తం గుర్తు కనిపిస్తే జనం తరుముకుంటున్నారు. మున్సిపల్, సార్వత్రిక ఎన్నికల్లో అయితే నాయకులు ఇండిపెండెంట్లుగానైనా పోటీ చేసేందుకు ముందుకొస్తున్నారు గాని కాంగ్రెస్ టిక్కెట్ అంటే అడ్రస్ లేకుండా పరారవుతున్నారు.

ఇంత పాపపు పని చేసి కాంగ్రెస్ చివరికి సాధించిందేమిటి? కేసీఆర్ అనే పిచ్చోడి చేతికి తెలంగాణ అనే రాయిని అందించడం. అతను చేతిలో రాయిని పెట్టుకుని దీంతో కొడతానని సీమాంధ్ర వైపు చూస్తున్నాడు. ఇంతవరకు సార్వత్రిక ఎన్నికలు జరగలేదు. తెలంగాణలో ఏ పార్టీ అధికారంలోకి వస్తుందో తెలియదు. కాని ఈలోపే కేసీఆర్ రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నాడు. కృష్ణ నీటిని తెలంగాణలో ప్రాజెక్టులు నిండిన తర్వాతే ఆంధ్ర ప్రాజెక్టులకు వదలాలంట, హైదరాబాద్‌లోని సీమాంధ్ర ఉద్యోగులకు ఆప్షన్లు ఉండవని, సీమాంధ్రకు పోవాల్సిందేనని హెచ్చరిస్తున్నాడు. అధికారం చేతిలో లేకుంటేనే కేసీఆర్ ఇంతగా పేలుతున్నాడు. రేపు అధికారం వస్తే ఇంకెంతగా రెచ్చిపోతాడు. చేతిలో తుపాకీ వున్న ఉగ్రవాది నేరుగా మనుషులను చంపుతాడు, కాని కేసీఆర్ అధికారంలోకి వస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుంది, ప్రాంతీయ విద్వేషాలు చెలరేగడానికి ఎక్కువ అవకాశముంది. కేసీఆర్ ఆ పని చేస్తాడు కూడా! మహారాష్ట్ర నవనిర్మాణసమితి అధ్యక్షుడు రాజ్‌థాకరే కంటే పెద్ద ప్రమాదకారి కేసీఆర్. ఆయన ప్రాంతీయ విద్వేషపు చిచ్చుకు బలయ్యేది సీమాంధ్రులే కాదు, తెలంగాణవాళ్లు కూడా! ఈ వాస్తవాన్ని ఆ ప్రాంత ప్రజలు గ్రహించాల్సివుంది. కేసీఆర్ తెలంగాణలో బలపడడం కోసం, లేదా హైదరాబాద్‌పై పట్టు కోసం హైదరాబాద్‌లో వుంటున్న సీమాంధ్రులను లక్ష్యంగా చేసుకునే అవకాశముంది. తాను అంటున్నట్లే కృష్ణజలాల విషయంలోనూ గొడవకు దిగొచ్చు. అప్పుడు అది రెండు ప్రాంతాల మధ్య ఘర్షణకు దారితీసే అవకాశముంది. సీమాంధ్రవాళ్లు కృష్ణ, గోదావరిల నీటి విషయంలో వివాదానికి దిగితే నష్టపోయేది తెలంగాణ ప్రాంతమే. ఎందుకంటే తెలంగాణలోని కొన్ని ప్రాంతాలకు పైప్‌లైన్లు వేసుకుంటేగాని నీటి నీళ్లు ఎక్కువు. కాని సీమాంధ్రలో ఆ పరిస్థితి లేదు. భౌగోళికంగా సీమాంధ్రకు ఈ నదుల నీళ్ల పారుదల చాలా అనువుగా ఉంటుంది.

ఇరు ప్రాంతాల మధ్య ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడితే ముందుగా దాని ప్రభావం పడేది హైదరాబాద్ మీదే! సీమాంధ్ర ఉద్యోగులు హైదరాబాద్‌లో ఉండాల్సిన అవసరం లేదని కేసీఆర్ భావిస్తే, సీమాంధ్ర పారిశ్రామికవేత్తలు గాని, వ్యాపారవేత్తలు గాని, సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు గాని, సినీ ఇండస్ట్రీ గాని హైదరాబాద్‌లో ఉండాల్సిన అవసరముండదు. వీళ్లంతా బిచాణా ఎత్తేస్తే హైదరాబాద్ సగం ఖాళీ అవుతుంది. హైదరాబాద్‌లో అత్య ధికశాతం పెట్టుబడులు పెట్టిన వారిలో సీమాంధ్రులదే పైచేయి. వాళ్లంతా సీమాంధ్రవైపు మళ్లితే హైదరాబాద్ పురోగతి కుంటుపడడం ఖాయం. ఇప్పటికే హైదరాబాద్‌లో వుంటున్న సీమాంధ్ర పారిశ్రామికవేత్తలు తమ సొంత రాష్ట్రంపై మమకారం చూపిస్తున్నారు. సీమాంధ్రకు ప్రత్యేకప్రతిపత్తి రావడం, ఉత్తరాంధ్ర, రాయలసీమలకు పదేళ్ల టాక్స్ హాలిడే వచ్చే అవకాశం ఉండడంతో వాళ్లంతా ఈ ప్రాంతాలలో పరిశ్రమలు పెట్టడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. హైదరాబాద్‌లో తమకు భద్రత వుండదనే అనుమానంతో సీమాంధ్రులున్నారు. కేసీఆర్ కారుకూతలు వారి అనుమానాలు మరింత బలపడేలా చేస్తున్నాయి.

కేసీఆర్ లాంటివారి చేతుల్లో అధికారం ఉంటే సీమాంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య రోజూ తగవులు తప్పవు. కావేరి నీళ్ల కోసం ఈరోజు కర్ణాటక - తమిళనాడు రాష్ట్రాలు తన్నుకుంటున్నాయి. రేపు కృష్ణ, గోదావరి నీళ్ల కోసం ఈ విధంగానే ఆంధ్రా - తెలంగాణలు తన్నుకోవాల్సి వస్తుంది.

# 'అంతర్'జాతీయం

- ఇకపై ఎన్నికల్లో పోటీ చేయదలచుకోలేదని కేంద్ర ఆర్థికమంత్రి పి.చిదంబరం ప్రకటించారు. ఒంటి మీదకు 68ఏళ్లు వచ్చాయని ఇక పోటీ చేసే ఓపిక లేదన్నారు.
- క్లోమ క్యాన్సర్‌కు మధుమేహానికి మధ్య సంబంధం ఉన్నట్లు ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు గుర్తించారు. మధుమేహం వల్ల భవిష్యత్‌లో క్లోమ క్యాన్సర్ వచ్చే ముప్పు ఒక మోస్తరుస్థాయిలో ఉన్నట్లు తేలిందని పరిశోధకులు వెల్లడించారు.
- విధి నిర్వహణలో అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన సైన్య, నౌక, వైమానిక అధికారులకు భారత రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ ఈ నెల 22న కీర్తిచక్ర పురస్కారాలను అందజేసారు. ఉత్తరాఖండ్ బాధితులను కాపాడే ప్రయత్నంలో ప్రాణాలు కోల్పోయిన కాన్స్టెబిల్, ముగ్గురు తీవ్రవాదులను చంపిన ఆర్మీ మేజర్ మహేష్‌కుమార్, 151రోజుల్లో ప్రపంచయాత్ర చేసిన అభిలాష్ టోమీలకు కీర్తిచక్ర పురస్కారాలు అందజేశారు.
- ఇండియన్ ముజాహిదీన్‌కు చెందిన నలుగురు ఉగ్రవాదులను ఢిల్లీ ప్రత్యేక విభాగం పోలీసులు మార్చి 23న రాజస్థాన్‌లో అరెస్ట్ చేశారు. వీరిలో యాసిన్‌భత్కల్ అనుచరుడు, పాకిస్థాన్‌కు చెందిన జియాఉర్ రెహ్మాన్ కూడా ఉన్నారు.
- అంగారకుడిపై ఒక కాలువను అమెరికా ఉపగ్రహం గుర్తించింది. ఇది గత మూడేళ్లలోనే ఏర్పడిందని, మూడేళ్ల క్రితం తీసిన ఫోటోలలో ఈ కాలువ లేదని నాసా శాస్త్రవేత్తలు ప్రకటించారు.
- మలేషియా ఎయిర్‌లైన్స్ విమానం హిందూ మహాసముద్రంలో కుప్పకూలి జలసమాధి అయ్యిందని మలేషియా ప్రధానమంత్రి నజీబ్‌రజాక్ ప్రకటించారు. ఇందులో ఉన్న 239 మంది ప్రయాణీకులలో ఎవరూ బ్రతికే పరిస్థితి లేదని నిర్ధారించారు. ఉపగ్రహం తీసిన ఫోటోల ద్వారా ఈ విషయాన్ని నిర్ధారించినట్లు చెప్పారు.
- 1971లో అపోలో–15 యాత్రలో చంద్రుడి మీదకు వెళ్లి భూమికి తిరిగొచ్చిన ఏకైక కెమెరా దాదాపు రూ॥4.6కోట్లు పలికింది. జపాన్‌కు చెందిన టెరుకాజు ఫుజిసవా అనే వ్యాపారి ఈ కెమెరాను దక్కించుకున్నారు.
- సమాచార మార్పిడి, కొత్తవారిని చేర్చుకునే విషయంలో స్మార్ట్‌ఫోన్‌లు ఉగ్రవాదుల చేతిలో కీలక సాధనాలుగా మారుతున్నాయని జాతీయ భద్రతా సలహాదారు శివశంకర్ మీనన్ ఆందోళన వ్యక్తం చేసారు. ఇటీవలకాలంలో దేశంలో జరిగిన పలుసామాజిక ఉద్యమాలు సఫలం కావడంలోనూ స్మార్ట్‌ఫోన్ల పాత్ర ఉందని, అలాగే అవాస్తవాలు, వదంతులను వ్యాప్తి చేయడానికి కూడా స్మార్ట్‌ఫోన్‌లనే వాడుతున్నారని ఆవేదన చెందారు.
- సముద్రాంతర్భాగం నుండి అణ్వస్త్ర సామర్థ్యమున్న దీర్ఘశ్రేణి బాలిస్టిక్ క్షిపణిని 24వ తేదీ బంగాళాఖాతంలోని ఒక వేదిక నుండి ప్రయోగించారు. 2వేల కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను తాకే సామర్థ్యం ఈ క్షిపణికి ఉంది.

# వార్త వ్యాఖ్య

వార్త :- మా పార్టీ మద్దతు తృతీయ ఫ్రంట్‌కే! - కిరణ్.
**వ్యాఖ్య :- *అంత అవసరం వస్తుందనుకుంటున్నారా?***

వార్త :- సీమాంధ్ర అభివృద్ధి బాధ్యత బీజేపీదే! - వెంకయ్యానాయుడు.
**వ్యాఖ్య :- *అగాధంలోకి నెట్టింది మీరే కాబట్టా?***

వార్త :- మోడీకి విపరీత ప్రచారం. - మీడియాపై మండిపడ్డ అసదుద్దీన్.
**వ్యాఖ్య :- *ఉరిమురిమి మంగళం మీద పడడం అంటే ఇదే!***

వార్త :- చంద్రబాబుతోనే సీమాంధ్ర అభివృద్ధి. - ఎంపీ రాయపాటి.
**వ్యాఖ్య :- రాజకీయనాయకులకు దేవుడు రెండు నాలుకలిచ్చేటట్టున్నాడు.**

వార్త :- ఓటుబ్యాంకు రాజకీయాల్ని నిర్మూలించారు.
**వ్యాఖ్య :- *ఓటుబ్యాంకులే ప్రజాస్వామ్యాన్ని కబళిస్తున్నాయి.***

వార్త :- జెండా మోసిన వారిని విస్మరించం. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- *కొంపదీసి డైలీ లేబర్ క్రింద డబ్బులివ్వరుగా!***

వార్త :- కొంత కష్టమైనా పొత్తులకు సిద్ధం. - జయప్రకాశ్ నారాయణ.
**వ్యాఖ్య :- *లేకుంటే ఇంకొంచెం కష్టమవుతుందనా?***

వార్త :- మోడీ ప్రధాని కావాలి. - నాగార్జున ఆకాంక్ష.
**వ్యాఖ్య :- *రాహుల్‌ను వద్దనేగా!***

వార్త :- త్వరలో పార్టీ మారతా. - పితాని.
**వ్యాఖ్య :- *తొందరగా ఆ పని చేయండి. రెండు నెలల్లో మూడుపార్టీలు మారిన రికార్డన్నా ఉంటుంది.***

వార్త :- గుజరాత్ అభివృద్ధి కట్టుకథే. - బృందా కారత్.
**వ్యాఖ్య :- *మనం చేయం, చేసినవాళ్లను తిట్టకుండా ఉండం...***

వార్త :- రాష్ట్రంలో 25జిల్లాలు ఏర్పాటు చేస్తాం. - బీజేపీ సీమాంధ్ర అధ్యక్షుడు హరిబాబు.
**వ్యాఖ్య :- *పార్టీల జిల్లా అధ్యక్షుల సంఖ్య పెంచుకోవచ్చనా?***

వార్త :- కుటుంబానికి ఒకే టికెట్. - కాంగ్రెస్ అధిష్టాన విధాన నిర్ణయం.
**వ్యాఖ్య :- *ఒక్కో నాయకుడిని ఒక్కో కుటుంబంగా పరిగణిస్తారా?***

వార్త :- మేమొస్తే ఆరోగ్య హక్కు. - రాహుల్.
**వ్యాఖ్య :- *అవినీతి హక్కు కూడానా?***

వార్త :- కాంగ్రెస్ ఓటమి సుస్పష్టం. - అద్వానీ.
**వ్యాఖ్య :- *అది వాళ్లే చెబుతున్నారులే...***

# అభివృద్ధి ముసుగులో అవినీతి!

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు

నెల్లూరు ఆదిత్యనగర్‌లో ఈనెల 22న సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు పార్టీ తరపున కార్పొరేషన్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులను ఓటు వేయమని కోరుతూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పాటు మిగిలిన ప్రతి పక్ష పార్టీలు సీట్ల కుమ్ములాటలో నిమగ్నమై వున్నాయని వారిని గెలిపిస్తే ప్రజల బాధలు పట్టించుకునేవారే కరువవుతారని పేర్కొన్నారు. అభివృద్ధి పేరుతో అధికారపార్టీ అయిన కాంగ్రెస్‌పార్టీ నేతలు వేసిన రోడ్లమీదే మళ్ళీ నాసిరకం రోడ్లు వేస్తూ కోట్లాది రూపాయలు మింగేసారని అన్నారు. ప్రజాపోరాటాలే శ్వాసగా పనిచేస్తున్న మాదాల వెంకటేశ్వర్లుకు ఓటువేసి 16వ డివిజన్‌లో గెలిపించాలని కోరారు. ఓటుతో పాటు సిపియం అభ్యర్థుల్ని ప్రచారానికి కావలసిన నిధులను కూడా ఇవ్వమని అర్థించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్ర రాజగోపాల్, మాదాల వెంకటేశ్వర్లు, జెకె.పాణి, కట్టా సతీష్, పులిమి శ్రీధర్, బాషా తదితరులు పాల్గొన్నారు.

# అలరించిన సాతూరు సిస్టర్స్ త్యాగరాజకీర్తనలు

నెల్లూరు పురమందిరంలో జరుగుతున్న 49వ త్యాగరాజ స్మరణోత్సవాలలో ఈనెల 25న చెన్నైకు చెందిన సాతూరు సిస్టర్స్‌గా పేరొందిన లలితాసంతానం, భువన రాజ గోపాల్ ఆలపించిన త్యాగరాజ కీర్తనలు అందరినీ అలరించాయి. శ్రీలక్ష్మీ వెంకట్రామన్ వయోలిన్‌తో, శ్రీ గణేష్ మృదంగంతో, హరిహరసుబ్రహ్మణ్యం ఘటంతో వాయిద్య సహకారాన్ని అందించగా సీతమ్మ మాయమ్మ, రామా నిన్నే నమ్మినాను తదితర కీర్తనలు వారు ఆలపించి శ్రోతల మన్ననలు పొందారు.

# మోడీని ప్రధాని చేయడమే లక్ష్యం

నెల్లూరు మినిబైపాస్‌లోని భారతీయ జనతాపార్టీ కార్యాలయంలో ఈనెల 24న దాదాపు వందమంది వికలాంగులు బిజెపిలో చేరడం విశేషం. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డిలు వారిని పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సురేష్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడడం, నరేంద్రమోడీ దేశ ప్రధాని కావడం ఖాయమని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగుల సంక్షేమానికి తప్పక కృషిచేస్తామని తెలిపారు. వికలాంగులు స్పందిస్తూ మోడీని ప్రధానిని చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడీఎస్ఎస్ అధ్యక్షుడు బ్రహ్మానందం, ఉపాధ్యక్షుడు అంబూరు వెంకటాద్రి, కార్యదర్శి నాగార్జునరెడ్డి, గ్రామీణ కార్యదర్శి రాములమ్మ, హరికృష్ణ, బండారు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థుల దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఈనెల 24న కాంగ్రెస్‌పార్టీ మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్, మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కాంగ్రెస్‌పార్టీ తరపున సాధారణ ఎన్నికల్లో పోటీచేయాలనుకునే అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ప్రథమంగా తానే ఆత్మకూరు నియోజకవర్గం నుంచి పార్టీ అభ్యర్థిగా టిక్కెట్‌ను కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కొడవలూరు ధనుంజయరెడ్డికి దరఖాస్తును అందించారు. తదుపరి మరో 8నియోజకవర్గాలకు సంబంధించి 20మంది తమ దరఖాస్తులను అందించారు. మరో ఇద్దరు తిరుపతి, నెల్లూరు పార్లమెంట్ స్థానాలకు సంబంధించి దరఖాస్తులిచ్చారు. నెల్లూరుసిటీ, నెల్లూరురూరల్ స్థానాల నుంచి అభ్యర్థులుగా టికెట్ కోరుతూ పదిమంది సిటీకాంగ్రెస్ అధ్యక్షుడు చాట్ల నరసింహారావుకు దరఖాస్తులు అందించారు. పార్టీ టికెట్లు కోరుతూ దరఖాస్తులు చేసిన వారి జాబితా ఇలా వుంది.

ఆత్మకూరుకు ఆనం రామనారాయణరెడ్డి, కోవూరుకు చేవూరు దేవకుమార్‌రెడ్డి, పందిళ్ళపల్లి అరుణమ్మ, ఊటుకూరు శశిధర్, ఉదయగిరికి పి.చంచలబాబుయాదవ్, వెంకటగిరికి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, మాదాసు గంగాధరం, కావలికి జలదంకి మాజీ ఎంపీపీ కృష్ణారెడ్డి, దామిశెట్టి శ్రీనివాసులునాయుడు, సర్వేపల్లికి కనకట్ల రఘురాం ముదిరాజ్, సూళ్ళూరుపేటకు డి.మధుసూదన్‌రావు, నెల్లూరురూరల్‌కు ఆనం విజయ కుమార్‌రెడ్డి, పందిళ్ళపల్లి అరుణమ్మ, ఉడతా వెంకట్రావ్‌యాదవ్, నెల్లూరుసిటీకి చాట్ల నరసింహారావు, మాదాసు గంగాధరం, ఎన్ఎస్‌యూఐ ముజీర్, అబ్దుల్‌మునాఫ్, ఐఎన్‌టీయూసీ సయ్యద్‌బాషా, పీసీసీకార్యదర్శి ఎన్.వేణుగోపాల్‌రాజు, గూడూరుకు బర్నాబాసు, గూడూరు లేదా తిరుపతి పార్లమెంట్‌కు పల్లం కృష్ణయ్యలు దరఖాస్తులు సమర్పించారు.

# రక్తదానం ఆరోగ్యదాయకం


ప్రపంచ క్షయదినోత్సవం సందర్భంగా ఈనెల 24న జిల్లా క్షయ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్ట సరస్వతి నగర్‌లోని ఐఎంఏ హాలులో రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జిల్లా ఇన్‌ఛార్జి డిఎంహెచ్‌ఓ డాక్టర్ కోటేశ్వరి ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయం నుంచి కాపాడిన వారవుతారని, అది దాత ఆరోగ్యానికి కూడా ఎంతో మేలని పేర్కొన్నారు. కావున ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎడీఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి, డీటీసీఓ డాక్టర్ సురేష్ కుమార్, రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్, వెంకట్, ఎస్.కె.బషీర్ తదితరులు పాల్గొన్నారు.

### మురళీమోహన్‌రాజుకు

# "స్వర్ణపుష్పం" సత్కారం



హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల 24న స్వర్ణపుష్పం సామాజిక మాసపత్రిక ప్రథమ వార్షికోత్సవ వేడుకల్లో వివిధ రంగాల్లో కృషిచేస్తున్న వ్యక్తులను సత్కరించారు. ఈ సందర్భంగా నెల్లూరుజిల్లాకు చెందిన వర్ధమాన కవి కె.మురళీమోహన్‌రాజును సాహిత్య రంగంలో అతని కృషిని ప్రశంసిస్తూ దుశ్శాలువా,సర్టిఫికేటులతో సత్కరించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షులు చిత్తరువు నాగేశ్వరరావు, స్వర్ణపుష్పం సంపాదకులు మక్కపాటి మంగళ, ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య, జ్యోతిష్య పండితుడు డాక్టర్ సి.వి.బి సుబ్రహ్మణ్యం, హైదరాబాద్ మాజీ డిప్యూటీ కలెక్టర్ నయనాదేవి పాల్గొన్నారు.

# తెలుగుదేశందే గెలుపు



సీమాంధ్రలో తెలుగుదేశం విజయం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు, మాజీఎమ్మెల్యే అంబికాకృష్ణ చెప్పారు. 25వ తేదీ నెల్లూరులోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో అన్ని మున్సిపాల్టీలలోనూ తెలుగుదేశమే విజయం సాధిస్తుందన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే ప్రతి రెండుజిల్లాలను కలిపి ఒక సెజ్‌గా ఏర్పాటు చేసి పారిశ్రామికంగా అభివృద్ధి చేయనున్నారని చెప్పారు. వ్యాపార వాణిజ్య వర్గాల వారికి అండగా నిలిచేది తెలుగుదేశంపార్టీయేనని, ఆర్య వైశ్యులంతా ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేసారు. ఈ సమావేశంలో 6వ డివిజన్ తెలుగుదేశం అభ్యర్థి వాయుగుండ్ల లక్ష్మయ్య కూడా పాల్గొన్నారు.

## వైకాపా నేతలకు షంటింగ్

జిల్లాలో షర్మిల యాత్ర అనుకున్నంతగా సక్సెస్ కాలేదు. కనీసం ఆమెను రిసీవ్ చేసుకున్న తీరు కూడా బాగాలేదు. మొదటిరోజే ఆత్మకూరులో ఆమె ప్రచార సభను బాగా ఆలస్యం చేసారు. జనం పోగుకావడం ఆలస్యమయ్యేసరికి ఆమెను వేచి ఉండేలా చేసారు. నాయుడుపేట, గూడూరులలోనూ నాయకులు ఆమె ప్రచారయాత్రను సీరియస్‌గా తీసుకోలేదు. దీనిపై షర్మిల ఫిర్యాదు చేయడంతో జిల్లా వైకాపా నాయకులకు అధిష్టానం నుండి అక్షింతలు పడినట్లు తెలుస్తోంది.

## నెల్లూరు కబుర్లు



నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ అభ్యర్థులకు మద్దతుగా నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎన్టీఆర్, బాలకృష్ణల డూప్‌లు

### జాతీయస్థాయి పరీక్షలో

# "రత్నం" సాయిశ్రీకర్ ప్రతిభ



జాతీయస్థాయిలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నేషనల్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్స్‌లో నెల్లూరు సరస్వతినగర్‌లోని డా॥ కిషోర్స్ రత్నం స్కూలు విద్యార్థి ఎన్.సాయి శ్రీకర్ నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారని స్కూలు జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు తెలిపారు. ఈనెల 22న స్కూలులో ఏర్పాటు చేసిన అభినందనసభలో ఆయన మాట్లాడుతూ గత ఆరుసంవత్సరాలుగా తమ పాఠశాల విద్యార్థులు ఈ ఎన్‌టిఎస్ఇ పరీక్షలలో విజయం సాధిస్తూ ప్రతి సంవత్సరం రూ॥60,000/-ల చొప్పున కేంద్ర ప్రభుత్వం నుంచి ఉన్నత విద్య పూర్తయ్యే వరకు స్కాలర్‌షిప్ పొందుతున్నారని తెలిపారు. స్కూలు డైరెక్టర్స్ డా॥కె.కృష్ణకిషోర్, వాసంతి కృష్ణకిషోర్‌లు ప్రతిభ చూపి నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన సాయి శ్రీకర్‌ను తల్లిదండ్రులను ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కెవిడి మనోజ్‌కుమార్, ఏఓ దీపిక, మేనేజర్ సునీల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# శీనయ్యకు బాలయ్య రథం



నెల్లూరు నగర తెదేపా అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ప్రముఖ సినీనటుడు నందమూరి బాలకృష్ణ ఈనెల 23న ప్రచార రథాన్ని అందించారు.

ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడుని ముఖ్యమంత్రిని చేసే వరకు కార్యకర్తలు అహర్నిశలు శ్రమించాలని బాలకృష్ణ సూచించారని ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ప్రస్తుతం తెదేపా ఒక్కటే రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తుందని, పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు తప్పక వుంటుందని బాలకృష్ణ భరోసా ఇచ్చారని పేర్కొన్నారు. అవినీతి అక్రమాలపై నిరంతరం పోరాటం చేసేలా ప్రజలను చైతన్యపరచాలని బాలకృష్ణ సూచించారని తెలిపారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే టికెట్‌ను తనకే ఇచ్చేటట్టు బాలకృష్ణ భరోసా ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో నగర తెదేపా నేతలు మామిళ్ళపల్లి వెంకటేశ్వర్లునాయుడు, ఆమంచర్ల ప్రభాకర్‌నాయుడు, వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### శ్రీనివాస అగ్రహారం హౌస్‌ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

# ఓటు హక్కుపై అవగాహన సదస్సు

నెల్లూరు శ్రీనివాస అగ్రహారం హౌస్‌ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న ఓటుహక్కు వినియోగంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న 43వ పోలింగ్ బూత్ లెవల్ ఆఫీసర్ సుమన్ మాట్లాడుతూ ప్రజలందరూ ఓటుహక్కును సద్వినియోగం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. ప్రతి ఇంటికి ఓటు స్లిప్‌లు పంపిణీ చేయబడతాయని తెలిపారు. శ్రీనివాస అగ్రహారంలో ఓటర్లలందరూ విఆర్ కళాశాలలోని 42,43నంబరుల రూములందు ఓటు వేయవచ్చని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు యం.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ అగ్రహారంలో 100మొక్కలు నాటడం జరిగిందని, వాటి సంరక్షణ బాధ్యతలను మొక్కలకెదురుగాగల గృహాల వారు తీసుకోమని కోరారు. ప్రతివీధి చివరన డైరెక్షన్ బోర్డులు ఏర్పాటుచేసామని, నాలుగు ప్రాంతాల్లో మ్యాప్‌లు నాటించామని, 90శాతం వీధిదీపాలు వెలిగేటట్లు చూసామని తెలిపారు. సదస్సులో ఉపాధ్యక్షులు గడ్డం శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి జి.కృష్ణారెడ్డి, సంయుక్త కార్యదర్శి పి.రాఘవరెడ్డి, కోశాధికారి పి.చంద్రమౌళి, కార్యవర్గసభ్యులు భవాని, యం.వి.చలపతిరావు, అమరనాథరెడ్డి, సరళ, లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి కార్యాలయం ప్రారంభం



నెల్లూరు 21వ డివిజన్‌లో ఈనెల 24న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్ళపాక అనూరాధ 21వ డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. 21వ డివిజన్‌లో తెదేపా అభ్యర్థిగా పోటీచేయుచున్న నూనె మల్లికార్జున యాదవ్‌ను గెలిపించమని కోరుతూ ఆమె జిల్లా పార్టీ కార్యవర్గసభ్యులు దండె విజయమ్మ తదితరులతో కలిసి ప్రచారాన్ని నిర్వహించారు.

## ఘనంగా అనిల్ జన్మదినం



కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గ ఎం.ఎల్.ఏ అభ్యర్థి పి.అనీల్ కుమార్‌యాదవ్ జన్మదినం సందర్భంగా యువజన విభాగం నాయకులు రాజన్న భవన్‌లో భారీ కేక్‌ను డా॥పి.అనిల్‌కుమార్ యాదవ్ చేత కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు డా॥పి.అనీల్‌కుమార్‌యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు.

ఈ కార్యక్రమాలను గంగం సుధీర్ బాబు, దాసరి గంగాధర్, బి.హరిప్రసాద్ నాయుడు, జి.పి.శ్రావణ్‌కుమార్, పవన్ కుమార్‌రెడ్డి, పెంచలరెడ్డి, పి.అకిల్ తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్సీపీలోకి టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు



టి.యన్.యస్.ఎఫ్ నగర అధ్యక్షులు కాకూరు ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరులోని మైపాడు గేటు సెంటర్ వద్ద వున్న నాగేంద్రనగర్‌లో వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గ యం.ఎల్.ఏ అభ్యర్థి డా॥పి.అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో ఈనెల 23న వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి డా॥పి.అనిల్‌కుమార్‌యాదవ్ పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో మల్లి, నాగేంద్ర, సతీష్, రాజ, పవన్, గంధం సుధీర్‌బాబు, అద్దంకి జగన్, బి.హరిప్రసాద్‌నాయుడు, పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ పారదర్శకంగా వ్యవహరిస్తుంది

### --- రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ ---



అనుమతిపత్రాన్నందజేస్తున్న డా॥ సుధాకర్

రెడ్‌క్రాస్ పారదర్శకంగా వ్యవహరిస్తుందని, రోగులకు కావలసిన రక్తాన్ని అందించేందుకు తగిన ఏర్పాట్లు చేసిందని రెడ్‌క్రాస్ రక్తనిధి కన్వీనర్ డాక్టర్ ఈదూరు సుధాకర్ తెలిపారు. ఈనెల 24న జరిగిన ఒక కార్యక్రమంలో ఉద్యోగశ్రీ, ఆరోగ్యశ్రీ, రక్తనిధి అనుమతి పత్రాన్ని సెయింట్ జోసెఫ్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేటివ్ సుపీరియర్ సిస్టర్ బెర్టిల్లియకు డా॥సుధాకర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా రక్తపు నిల్వలను ప్రజలు తెలుసుకోవచ్చని అన్నారు. రక్తం మార్కెట్లో దొరికే వస్తువుకాదని, దాతలు స్వచ్ఛందంగా ఇచ్చేదని అన్నారు. ముఖ్యంగా యువత ఎలాంటి అనుమానాలకు తావులేకుండా మూడు నెలలకోసారైనా రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ హాస్పిటల్ సిస్టర్స్ డా॥లిల్లీపుష్ప, డా॥ఆదర్శ్ అనుముల తదితరులు పాల్గొన్నారు.

# యంఐయం కార్యకర్తల సమావేశం





సమావేశంలో మహ్మద్‌రవూఫ్

నెల్లూరులోని యంఐయం కార్యాలయంలో ఈనెల 25న జరిగిన కార్యకర్తల సమావేశంలో జిల్లా అధ్యక్షులు మహ్మద్‌రవూఫ్ పాల్గొని ఎన్నికల కార్యాచరణ మీద చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 30న జరుగనున్న కార్పొరేషన్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజాసంక్షేమం, సమస్యల మీద పోరాడే వారిని, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో వుండే వారిని ఎన్నుకోవాలని కోరారు. రాజకీయ వ్యాపారం చేసే నాయకులను ఎన్నుకోవద్దని, ఎన్నికల్లో మనం వేసే ఓటు మన డివిజన్ అభివృద్ధికి ఉపయోగపడేలా ఆలోచించి వేయాలని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి హమీద్‌హుస్సేన్ మాట్లాడుతూ యంఐయం పార్టీని జిల్లాలో పటిష్ట పరిచేందుకు కార్యకర్తలందరూ కృషిచేయాలని, త్వరలో నగర, పట్టణ, మండల, డివిజన్ల వారీగా పూర్తిస్థాయి కమిటీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. సమావేశంలో నేతలు ఇలియాస్, షకీల్, యువజన విభాగం నేతలు హసీబ్, మురళీలు పాల్గొన్నారు.

# టౌన్‌హాల్‌లో ఉగాది వేడుకలు

ఈ నెల 31వ తేదీన సాయంత్రం 6గంటలకు జూనియర్ రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనం నందు శ్రీ జయనామ సంవత్సర ఉగాది సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జ్యోతిష్య విద్యావిశారద బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు పంచాంగ శ్రవణం చేస్తారు. కూచిపూడి నాట్యాచార్యులు దేగా సాంబశివరావు ఆధ్వర్యంలో సింహపురి కల్చరల్ అకాడమీ కూచిపూడి నృత్యాలయ విద్యార్థులచే అపురూప కూచిపూడి నృత్య ప్రదర్శన జరుగుతుంది. ఈ కార్యక్రమంలో స్వయంపాకుల శ్రీనివాసులు, భాస్కర్‌రెడ్డి, దుగ్గిశెట్టి భారతి, వొమ్మిన సుబ్రహ్మణ్యం, బిరదవోలు రామిరెడ్డి, ములుగు లక్ష్మీ మైథిలి, ఫణిదపు వీరబ్రహ్మం, దేగా సాంబశివరావు, హేమలక్ష్మి, వి.ఎల్.భవాని, అజయ్‌కుమార్, యస్.వి.రత్నం, సోమయాజులు, టి.పద్మనాభరాజులకు ఉగాది పురస్కారాలను అందజేస్తారు. విక్రమ సింహపురి సభ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుంది.

# ఎన్నికల నిర్వహణ సక్రమంగా చేయాలి

**- జిల్లా కలెక్టర్ శ్రీకాంత్**



నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 22న యం.పి.డి.ఓలతో జడ్‌పిటిసి మరియు యంపిటిసి ఎన్నికల ప్రక్రియపై జరిగిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రధానంగా ఓటరు జాబితా ఆయా పోలింగ్ కేంద్రాల వారీగా విభజనచేసి సక్రమంగా వుండేలా చూడాలన్నారు. ఎన్నికలలో పోటీచేయు అభ్యర్థులను నామినేషన్‌ల పరంగా వరుసక్రమంలో వారి పేర్లు, కేటాయింపు గుర్తులు, ఆయా పార్టీలపరంగా పరిశీలించి ఎన్నికల నిబంధనలకనుగుణంగా బ్యాలెట్ పత్రాలు తయారుచేయాలన్నారు. ఈ ఎన్నికలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలతో కాకుండా బ్యాలెట్ బాక్స్‌ల ద్వారా నిర్వహించడం జరుగుతుందని, కనుక అందుకు అవసరమైన బ్యాలెట్ పత్రాలు ప్రింటింగ్‌కు ఇచ్చి సిద్ధంగా వుంచుకోవాలన్నారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఎన్నికల సిబ్బందికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించి ఎన్నికలు పటిష్టంగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో అవసరమైన కనీస సౌకర్యాలు ఏర్పాటుచేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన మెటీరియల్‌ను సిద్ధంగా వుంచుకొని పోలింగ్ రోజుకు ఒకరోజు ముందుగానే చేరేటట్లు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన గదులను గుర్తించి పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా ఎలాంటి సమస్యలు లేకుండా, పటిష్టమైన భద్రతా చర్యలు పోలీస్ అధికారుల సమన్వయంతో తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ అసిస్టెంట్‌కలెక్టర్ అళగవర్షిణి, జిల్లా పరిషత్ సిఇఓ జితేంద్ర, మండల అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# కల్యాణ వైభవం...!




నెల్లూరు నుండే కాక రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి నెల్లూరీయులు ఎవరు కాశీయాత్రకు వెళ్ళినా వారికి ఆతిథ్యం ఇచ్చి సర్వేశ్వరుని దర్శన భాగ్యాన్ని సులభతరం చేసే "జయరాంస్వామి" అంటే తెలియని నెల్లూరీయులు అరుదు. పొదలకూరు మండలంలోని బిరదవోలు చెర్లోపల్లి ఈయన స్వగ్రామం. ఈయన అసలుపేరు జయరామారావు. ఈయన కుమారుడు **శివశంకర్ - శ్రీవాణి**ల కల్యాణం మార్చి 20వ తేదీన విశాఖపట్నంలో జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

# ఒకటే పేరు... గుర్తులు వేరు







దుత్తలూరు జడ్పీటీసీ ఎన్నికలలో చిత్రమైన పోటీ నెలకొంది. తెలుగుదేశం అభ్యర్థి, వైయస్సార్ కాంగ్రెస్ అభ్యర్థి ఇద్దరిపేర్లు కూడా చీదర్ల మల్లిఖార్జున కావడం విశేషం. వీళ్లిద్దరూ దాయాదులే. పేర్లు ఒకటే అయినా గుర్తులు, పార్టీలు వేర్వేరు కావడంతో ఓటర్లకు ఇబ్బంది లేదు.

# జెడ్పీటీసీ అభ్యర్థులు

| మండలం | వైఎస్సార్సీపీ | టీడీపీ |
|---|---|---|
| కావలి | సోమయ్యగారి పెంచలమ్మ | ఉప్పాల వరలక్ష్మమ్మ |
| బోగోలు | బాపట్ల కామేశ్వరి | కుంచాల రమ |
| అల్లూరు | దండా పద్మావతి | మేడా ప్రమీలమ్మ |
| దగదర్తి | గోవుల శోభారాణి | మాలేపాటి పద్మావతి |
| జలదంకి | మేదరమెట్ల శివలీల | వంటేరు పద్మావతి |
| కలిగిరి | గంగపట్ల సంతోషమ్మ | శ్రీరామ్ శ్రావణ్య |
| దుత్తలూరు | చీదర్ల మల్లికార్జున | చీదర్ల మల్లికార్జున |
| వరికుంటపాడు | కాకి ఆశీర్వాదమ్మ | నూనె వేణి |
| ఆత్మకూరు | బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి | గూటూరు రాజేశ్వరరావు |
| అనంతసాగరం | పెయ్యల సంపూర్ణమ్మ | ముంగపాటి సునీత |
| అనుమసముద్రం | కూదారి హజరత్తమ్మ | ఉసురుపాటి మంజుల |
| వింజమూరు | పులిచెర్ల వెంకటనారాయణరెడ్డి | యన్నం రామచంద్రారెడ్డి |
| ఉదయగిరి | లక్కినేని ప్రవీణ | నల్లిపోగు బాలపెంచలమ్మ |
| సంగం | మడగల దేవసహాయం | బాపన రఘురామయ్య |
| సీతారామపురం | కలివెల జ్యోతి | కలివెల జస్విక,<br>కలివెల జస్వికా |
| మర్రిపాడు | పెనగలూరు చంద్రకళ | కందిమడకల వెంకటవిద్య |
| కలువాయి | బులగాకుల అనిల్‌కుమార్‌రెడ్డి | పుల్లపునేని వెంకటేశ్వర్లు |
| చేజర్ల | షేక్ సల్మాషిరీన్ | చావలి పెంచలమ్మ |
| కొండాపురం | వీరళ్ల శ్రీనివాసులు | దామా మహేశ్వరరావు |
| నాయుడుపేట | గోవా మునిరత్నం | పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్ |
| దొరవారిసత్రం | ముప్పాళ్ల విజేత | లింగారెడ్డి రాధిక |
| ఓజిలి | కట్టా జ్యోతి | కనుమూరి మంజులమ్మ |
| పెళ్లకూరు | గునిశెట్టి వెంకటేశ్వర్లు | గునిశెట్టి జితేంద్ర |
| సూళ్లూరుపేట | తాటిపర్తి శ్రీనివాసులరెడ్డి | వేనాటి రామచంద్రారెడ్డి |
| తడ | కాళవి రఘు | బొమ్మన శ్రీధర్ |
| గూడూరు | బొమ్మిరెడ్డి పద్మ | కొండూరు హేమలత |
| డక్కిలి | బండి కృష్ణారెడ్డి | ఏలేశ్వరం రామచంద్రయ్య |
| చిట్టమూరు | దువ్వూరు భారతి | దువ్వూరు ఇందిరమ్మ |
| చిల్లకూరు | ఓడూరు యమునమ్మ | సన్నారెడ్డి జ్యోతి |
| బాలాయపల్లి | ఏనుగుల రాములమ్మ | మోపూరు శాంతి |
| కోట | ఉప్పాళ్ల ప్రసాద్‌గౌడ్ | కందలి బాలకృష్ణయ్య |
| సైదాపురం | పొట్టేళ్ల శిరీష | ఆవుల వాణి |
| వాకాడు | బత్తిన ప్రమీల | బొజ్జా సునీల |
| వెంకటగిరి | తుపాకుల పోలయ్య | దాతం గురునాథం |
| నెల్లూరు రూరల్ | గోళ్ల సుబ్బరత్నమ్మ | యాకసిరి రమ |
| ముత్తుకూరు | నెల్లూరు శివప్రసాద్ | ఏకొల్లు కోదండరామయ్య |
| మనుబోలు | తిరువీధి రమేష్ | గునపాటి శేఖరయ్య |
| కోవూరు | దొడ్డంరెడ్డి నిరంజన్‌బాబురెడ్డి | చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి |
| కొడవలూరు | సన్నారెడ్డి నందకుమార్‌రెడ్డి | ఇరువూరు శ్రీధర్‌రెడ్డి |
| ఇందుకూరుపేట | బందిల వెంకటరమణయ్య | ఈదూరు చెన్నయ్య |
| బుచ్చిరెడ్డిపాళెం | రొండ్ల జయరామయ్య | యంద్రపాటి పెంచలనర్సయ్య |
| పొదలకూరు | బిరదవోలు మహేంద్ర | దర్శి విజయబాబు |
| రాపూరు | పిల్లకదుపు శకుంతల | కండే రమణయ్య |
| తోటపల్లి గూడూరు | మన్నెం చిరంజీవులు | బొమ్మి సురేంద్ర |
| వెంకటాచలం | మందల వెంకటశేషయ్య | కుంకాల దశరథనాగేంద్రప్రసాద్ |
| విడవలూరు | ఒంటేరు లక్ష్మీకాంతమ్మ | చిమటా రమాదేవి |

# దుష్ప్రచారాలు నమ్మొద్దు

వైఎస్సార్సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి పొదలకూరులోని పార్టీ కార్యాలయంలో ఈనెల 22న ఎంపీటీసీ ఎన్నికల్లో పోటీచేస్తున్న పార్టీ అభ్యర్థులకు బీఫారాలు అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దగుల్బాజీ రాజకీయాలు చేయడం తనకు అలవాటులేదని, శ్వాస ఉన్నంత వరకు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి వెంటే వుంటానని తెలిపారు. సర్వేపల్లిలో తనను ఎదుర్కోలేని కొన్ని రాజకీయ శక్తులు తాను పార్టీ మారుతున్నట్టు దుష్ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌పై గౌరవంతో 2009లో ఆత్మకూరు టికెట్ తనకు దక్కకపోయినా కాంగ్రెస్‌పార్టీలోనే కొనసాగానని, ఆ మహానేత మరణం తర్వాత ఆయన కుటుంబం పట్ల అభిమానంతో వైఎస్సార్సీపీలో చేరానన్నారు. పార్టీలో చేరిన వెంటనే జగన్మోహన్‌రెడ్డి జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించారని, తదుపరి సర్వేపల్లి నియోజకవర్గ బాధ్యతలు కూడా అప్పగించారని గుర్తుచేసారు. తన తండ్రి కాకాణి రమణారెడ్డి హయాం నుంచి నిజాయితీగా, విశ్వసనీయత ఊపిరిగా రాజకీయాలల్లో కొనసాగుతున్నామని ఊసరవెల్లి రాజకీయాలు చేసే చంద్రబాబు నాయకత్వంలోని టిడీపీలోకి తాను వెళుతున్నట్టు ప్రచారం చేయడం అర్ధరహితమన్నారు. ఇటువంటి దుష్ప్రచారాన్ని తాను పట్టించుకునేవాడిని కాదని, కాకపోతే కార్యకర్తలు అయోమయానికి లోను కాకుండా వుండేందుకు వివరిస్తున్నానని తెలిపారు. చంద్రబాబు దుష్టపాలనకు అవకాశం ఇవ్వకుండా ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంలో వైఎస్సార్సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు కోనం బ్రహ్మయ్య, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, పొదలకూరు సర్పంచ్ తెనాలి నిర్మలమ్మ తదితరులు ఉన్నారు.




సమావేశంలో పాల్గొన్న కాకాణి




# కాంగ్రెస్ నాయకుల ప్యాకేజీ టూర్!

గల్పిక

ఢిల్లీలోని టెన్‌జనపథ్ అది. సోనియాగాంధీ, మన్మోహన్‌సింగ్, దిగ్విజయ్‌సింగ్, షిండే, దాసరి జైరాం రమేష్‌లు కూర్చుని ఉన్నారు. వారికెదురుగా మెగాస్టార్ చిరంజీవి, రఘువీరారెడ్డి, ఆనం రామ నారాయణరెడ్డి, బొత్స సత్యనారాయణ, కన్నా లక్ష్మీ నారాయణ, కొండ్రు మురళీ, డొక్కా మాణిక్య వర ప్రసాద్, కనుమూరి బాపిరాజు, పనబాక లక్ష్మి, దేవినేని నెహ్రూ, జె.డి.శీలం, కిల్లి కృపారాణి, మల్లాది విష్ణు, వట్టి వసంతకుమార్ వంటి సీమాంధ్ర కాంగ్రెస్ నేతలు కూర్చుని ఉన్నారు. వారితో సోనియా ఉండి... సీమాంధ్రలో పార్టీని పటిష్టం చేయాలి... పార్టీని అధికారంలోకి తీసుకురావాలని అంది. వెంటనే వట్టి వసంతకుమార్ లేచి... పార్టీ పటిష్టంగానే వుంది మేడమ్, రేపు ఎన్నికల్లో అధికారంలోకి కూడా రాబోతుందని చెప్పాడు. ఆ మాటలకు సీమాంధ్ర కాంగ్రెస్ నేతలంతా అవాక్కయ్యారు. కొండ్రు మురళీ వుండి... ఏంటన్నా నువ్వు చెప్పేది కాంగ్రెస్‌పార్టీ గురించేనా అని అడిగాడు. కాదు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, అది కూడా మన పార్టీయే కదా, అక్కడున్నది కూడా మన నేతలే కదా, మన పార్టీ గెలిస్తే ఏంటి, వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలిస్తే ఏంటని వసంత కుమార్ అన్నాడు. దానికి సోనియాకు మండింది. ఇలాంటి డొంకతిరుగుడు మాటలు వద్దు. సీమాంధ్రలో మన పార్టీ గెలిచేలా చూడండి, అక్కడున్న ఎంపీ సీట్లన్నీ కావాలి... రాహుల్‌బాబును అర్జంట్‌గా ప్రధానిని చేసెయ్యాలి. లేదంటే జనం మనల్ని మరచిపోయే ప్రమాదముందని అంది. అప్పుడు ఆనం రామనారా యణరెడ్డి అక్కడే చచ్చిపడి వున్న బొద్దింకను చేతిలోకి తీసుకుని మేడమ్, చచ్చిన ఈ పురుగుకు మళ్లీ ప్రాణం పోయొచ్చేమోగాని, సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీ గెలుపు అనేది మరచిపోండన్నాడు. ఏం చిరంజీవి కాంగ్రెస్‌ను నువ్వు బ్రతికించలేవా? అని సోనియా చిరును ప్రశ్నిం చింది. అందుకు చిరు... మేడమ్ సినిమాలలో ఒంటి చేత్తో వందమందిని కొట్టిన అనుభవముంది. డజను బుల్లెట్లు శరీరంలో దిగినా ఎన్నో క్లైమాక్స్ సీన్‌లలో లేచి పరుగెత్తి విలన్‌లను చంపిన వాడిని... ఆఫ్ట్రాల్ నా హీరోయిజంతో సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీని బ్రతికించలేనా? అని అన్నాడు. ఆ మాటతో సోనియా సంతోషించింది. సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీని బ్రతికిం చడానికి నువ్వే కరెక్ట్... అందుకే నిన్ను ప్రచారకమిటీ సారథిగా నియమిస్తున్నానని ప్రకటించింది.

టెన్‌జనపథ్ నుండి నాయకులంతా బయటకు వచ్చారు. ఆనం రామనారాయణరెడ్డి ఉండి... అదేంటి చిరంజీవి గారు... సీమాంధ్రలో పార్టీని గెలిపిస్తామని చెప్పారు, ఇదేమన్నా సినిమా అనుకున్నారా... చచ్చిన హీరో క్లైమాక్స్‌లో లేచి ఫైటింగ్ చేయడానికి, రియల్ జీవితం అని అన్నాడు. దానికి చిరంజీవి... మీరక్కడే పప్పులో కాలేస్తున్నారు. ఇప్పుడు మనం గెలిపించ లేమని చెప్పామనుకోండి... మేడమ్ డిస్టర్బ్ అయిపో తుంది. రాహుల్‌ను ప్రధానిని చేయాలంటే ఇంకెన్ని రాష్ట్రాలను విభజించాలో చెప్పమంటుంది, అనవ సరంగా మళ్ళీ దిగ్విజయ్‌సింగ్, జైరాంరమేష్, షిండే లకు పని... ఇప్పుడంత సీన్ అవసరమా... ఎలాగూ దేశంలో అన్నిచోట్లా జరిగినట్లే మన రాష్ట్రంలోనూ ఎన్నికలు జరుగుతాయి. దేశమంతా కాంగ్రెస్ ఎలాగూ ఓడిపోతుంది. ఆ బాధలో మన రాష్ట్రంలో ఓటమిని ఆమె సీరియస్‌గా తీసుకునేంత సీన్ ఉం డదు. ఈలోపు మనం అన్నీ సర్దేసుకోవచ్చని చెప్పాడు. ఇప్పుడు పార్టీని పటిష్టం చేయడానికి మనం కష్టపడుతున్నట్లు నటించాలిగా... ఏ ప్రోగ్రామ్ పెట్టుకుని నటిద్దామని కనుమూరి బాపిరాజు అడిగాడు. దానికి బొత్స సత్యనారాయణ లేచి... బస్సుయాత్ర అయితే బాగుంటుందన్నాడు. వెంటనే జె.డి.శీలం... అది కరెక్ట్. ఎక్కడన్నా జనం తరుముకుంటే వాళ్లకు చిక్కకుండా బస్సెక్కి పారిపోవచ్చు, ఈమధ్య సీమాంధ్రలో ఎక్కడకు వెళ్లినా చెప్పులు, చీపుర్లు విసిరేస్తున్నారు. ఫ్రీగా వస్తున్నాయని చెప్పి ఈమధ్య వాటిని కొనడం కూడా మానేసానన్నాడు. పనబాక లక్ష్మి ఉండి... బస్సుయాత్ర ప్లాన్ బాగానే ఉంది, కాని ప్రజల మధ్యకు ధైర్యంగా పోగలమంటారా? అని ప్రశ్నించింది. తలలకు హెల్మెట్లు పెట్టుకుంటే సేఫ్‌గా పోయి రావచ్చునని దేవినేని నెహ్రూ అన్నాడు. అప్పుడు ఆనం రామనారాయణరెడ్డి... మనం ప్రజల మధ్యకు పోవడం, వారిని మెప్పించడం అయ్యే పని కాదు, నేను చెప్పినట్లు చేద్దాం. ఒక వోల్వోబస్సును అద్దెకు తీసుకుందాం. మొదట అరకులోయ నుండి మొదలుపెడదాం. అక్కడి ప్రకృతి అందాలను తిలకిద్దాం, ఆ తర్వాత సింహాచలం అప్పన్నను దర్శిం చుకుందాం, సాయంత్రం విశాఖ ఆర్‌కె బీచ్‌లో సరదాగా షికారు కొడదాం, ఆపైన అన్నవరం వెళ్లి సత్యనారాయణస్వామి దర్శనం చేసుకుందాం, రాజ మండ్రి వద్ద పడవెక్కి గోదావరిలో విహరిస్తూ పాపి కొండలు చూద్దాం, పడవలోనే భద్రాచలం పోదాం, భద్రాద్రి రామయ్యను దర్శించుకుని తిరిగి రాజమండ్రికి వస్తాం. అక్కడనుండి బయలుదేరి ద్వారకా తిరుమల చేరుకుంటాం, అక్కడ వెంకన్న దర్శనం చేసుకుందాం, ఆ తర్వాత భీమవరం వెళ్ళి మావుళ్ళమ్మను దర్శించి పూజలు చేద్దాం. తాడేపల్లిగూడెంకు వెళ్లి బెల్లం సలీసుగా వస్తుంది కాబట్టి తలా పదికిలోలు బెల్లం కొందాం. ఆ తర్వాత విజయవాడ చేరుకుని కనక దుర్గమ్మను దర్శించుకుంటాం, ఆ తర్వాత కృష్ణానదిలో పడవవిహారం చేద్దాం. ఆ తర్వాత గుంటూరు జిల్లా మంగళగిరిలో పానకాల స్వామి ఆలయానికి వెళదాం, అక్కడనుండి పెద్దకాకాని వద్దగల హాయ్‌లాండ్‌కు చేరుకుని రెండుగంటలు హాయిగా గుడుపుదాం. అలాగే కోటప్పకొండకు కూడా పోదాం. గుంటూరు జిల్లా తర్వాత ప్రకాశంజిల్లాలో మాలకొండస్వామిని దర్శిస్తాం, ఆపైన కర్నూలు జిల్లాలో శ్రీశైలం, మంత్రా లయం, అహోబిలం, మహానంది వంటి పుణ్యక్షేత్రా లను సందర్శిస్తాం, ఆ తర్వాత కడప జిల్లాలో బ్రహ్మంగారి మఠం, దేవునిగడప, కడప పెదదర్గాలను సందర్శిద్దాం, కడప నుండి నేరుగా అనంతపురం పోదాం, కదిరి లక్ష్మీనరసింహస్వామిని, పుట్టపర్తి ఆశ్రమాన్ని దర్శిద్దాం. ఆ తర్వాత కాణిపాకం నుండి చిత్తూరుజిల్లా పర్యటన మొదలవుతుంది. మొదట కాణిపాకం, తర్వాత తిరుమల తిరుపతి, శ్రీకాళహస్తి ఆలయాలను దర్శిస్తాం. అక్కడనుండి నెల్లూరుజిల్లాకు చేరుకుంటాం. అక్కడ పెంచలకోన నరసింహస్వామిని, సూళ్లూరుపేట చెంగాళమ్మను, జొన్నవాడ కామాక్ష మ్మను సందర్శించి నెల్లూరు నగరానికి చేరుకుంటాం. నెల్లూరు నగరంతో మన బస్సుయాత్ర పూర్తవుతుంది. అప్పటికి అన్ని రకాల ఎన్నికలు కూడా అయిపో వస్తాయి. ఈలోపు బస్సుయాత్ర ద్వారా మనం తెగ కష్టపడుతున్నట్లు ప్రచారమొస్తుంది. సోనియా దృష్టికి కూడా పోతుంది. మన డబ్బు రూపాయి లేకుండా ఈ టూర్‌ప్యాకేజీతో సీమాంధ్ర లోని అన్ని పుణ్యక్షేత్రా లను ఒకటిక్కెట్ మీద నాలుగు సినిమాలన్నట్లుగా చుట్టేసి రావచ్చన్నాడు. ఆనం ప్రతిపాదించిన పుణ్యక్షేత్రాల టూర్ ప్యాకేజీకి అందరూ ఓకే అనడంతో సీమాంధ్ర బస్సుయాత్రకు బయల్దేరారు.

కదంబం

## పునాది

వంజవాక సతీష్‌కుమార్‌రెడ్డి,
నెల్లూరు. 9493234515.

ఉగాది
నవ ఉత్తేజానికి నాంది
పునరుత్తేజానికి పునాది
పురావైభవాన్ని మననం
చేసుకుంటూ వర్తమాన పరిమళాలను
భవిష్యత్తరాలకు అందించే వారధి
మాటలలో చెప్పలేని
మార్పులెన్నో జరిగిపోతుంటాయి
కాలవాటికలో కరిగిపోతుంటాయి
మనిషి మనుగడలో
మరమ్మతులెన్నో, మరీచికలెన్నో
అడుగుఅడుగుకీ
అవరోధాలెన్నో అనుభూతులెన్నో
అన్నింటినీ బేరీజు వేసుకోవాల్సిన
సమయమొకటుంటుంది
సమాజంతో అనుసంధానించుకోవలసిన
సంగతొకటుంటుంది
సహానుభూతిని పొందాల్సిన
పండుగొకటుంటుంది
అనాదిగా అందరికీ శుభాలను
మెండుగ అందించే వేడుకొకటుంది
అందరి సుఖసంతోషాలను
నిండుగ ఆకాంక్షించే వేదికొకటుంది
అదే ఉగాది....
నవ ఉత్తేజానికి నాంది
పునరుత్తేజానికి పునాది

## జ్యోత్స్నఫణిజకు "పెరసం" ఉగాది పురస్కారం



రానున్న జయ నామ సంవత్సర ఉగాదిని పురస్క రించుకొని నెల్లూరు పురమందిరంలో ఈనెల 23న పెన్నా రచయితల సంఘం (పెరసం) ఆధ్వ ర్యంలో కవిసమ్మే ళనం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణాజిల్లా కైకలూరుకు చెందిన గాయని, కవయిత్రి జ్యోత్స్నఫణిజను ఆత్మీయంగా సత్కరించారు. నెల్లూరీయులైన ప్రముఖ సినీ నేపథ్యగాయని ఎస్పీ శైలజ చేతుల మీదుగా ఆమెకు ఈ పురస్కారాన్ని అందించారు. ఎస్పీ శైలజ మాట్లాడుతూ జ్యోత్స్నఫణిజ పుట్టుకతోనే వచ్చిన అందత్వానికి వెరవక ఆత్మవిశ్వాసంతో మంచి అభిరుచిని స్వంతం చేసుకుని అటు గాయనిగా, ఇటు కవయిత్రిగా ఎదగడం అభినందనీయమన్నారు. ఆమె ఆంగ్లంలో కవితలు రాయడం, అనువాదం చేయడం మాత్రమేకాక, కవిత్వంలో ఎం.ఏ, పి.హెచ్‌డీ చేస్తుండడం ఎంతో మందికి స్ఫూర్తినిచ్చే విషయమన్నారు.

కార్యక్రమంలో పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు మోపూరు పెంచల నరసింహం, కార్యదర్శి గుండాల నరేంద్రబాబు, ప్రధానకార్యదర్శి జి.సుభద్రా దేవి, సాహితీప్రియులు కాళిదాసు పురుషోత్తం, బివి నరసింహం, ఆదిత్య, శంకరనారాయణ, కవులు ఇంద్రగంటి మధుసూదన్, రాఘవాచారి, గాయత్రి, ప్రసన్న, తోటసులోచన తదితరులు పాల్గొన్నారు.

## శైలజామిత్రకు 'ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు'



ఆధునిక కవిత్వానికి ప్రతిష్టాత్మక పురస్కారంగా భావించే ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు కోసం (2013) శైలజామిత్రకు 'రాతిచిగుళ్ళు' కవితాసంపుటి ఎంపికైనట్లు అవార్డు వ్యవస్థాపకులు డా॥రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డు న్యాయనిర్ణేతలుగా ఆచార్య రాచపాళెం, ఆచార్య మసనచెన్నప్ప, శ్రీకొప్పర్తి వ్యవహరించారు. ఈ అవార్డు పొందినవారిలో శైలజామిత్ర 26వ వారు. ఈ అవార్డు ప్రధానసభ త్వరలో అనంతపురంలో జరుగుతుందని ఆయన తెలియజేశారు.

## ప్రకటన

గుర్రాల రమణయ్య,
నెల్లూరు, 9963921943.

ఉగాది అంటే నాకు
మల్లెలు మొల్లలు విరబూయటం కాదు
వెన్నెల బాణాలు వెచ్చగా గుచ్చుకోవటం కాదు
హలాలు దున్నిన పొలాల నిండా హరిత హేమం పండినట్లు
కడలినిమించిన ఆనందంతో కరకుని గుండెగాదె నిండినట్లు
మనుషులతో పాటు మనసులు ఆత్మీయంగా కౌగలించుకోవటం!
ఉగాది అంటే నాకు
ఆరు రుచుల పచ్చడి చవిచూడటంకాదు
సంవత్సరంలో కురిసే వర్షాలు సుఖాలు లాభాల లెక్కలుకాదు
మనిషిని మనిషి వెచ్చని పలకరింపులతో పూలవాన కురిసినట్లు
రెండడుగులతో అగాధాలను దాటి ఆత్మలు రెండు ఏకమైపోయినట్లు
విశ్వమానవ సౌభ్రాతృత్వం అణువణువున వెల్లివిరియటం
ఉగాది నా పునరుజ్జీవన గరిమనాభి
సమాధుల పురాతన తత్వాల నుండి
అధునాతన చైతన్య తత్వాల వరకు
ఎనలేని సంస్కారాల విదురనీతి
మనిషి గుండెతడిని
వెచ్చని అమ్మ ఒడిని
గుర్తుతెచ్చే నవాది
అమ్మను ఉగాదిని మర్చిపోయినవాడు
దేనికి కొరగాడని విపులీకరించే నిత్యసత్యపరిమళ జవాది
జీవపరమాత్మల ఏకత్వాన్ని ప్రభోదిస్తూ
సృష్టి బీజావాపక్రమాన్ని వివరిస్తూ
జననమరణ దుఃఖతీరాల నుండి
సంసారాశ్రిత కలిమిలేముల నుండి
బానిసత్వ అరిషడ్వర్గ తమస్సుతో
తారకదీపాన్ని వెలిగించే సనాతన పునాది ఉగాది
ఉగాదిని ఉన్మత్తావేశ పరివేశాల నుండి కాదు
రండి! మనుషుల జాతర నుండి చేసుకుందాం
జాతి సమస్త చైతన్య మంత్రాక్షరాల పుస్తకమని చాటిచెబుదాం!

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఓర్పు, విజ్ఞతతో సమస్యలు సర్ధుబాటు చేసుకొనవలసి ఉంటుంది. దూరప్రయాణాలు నిర్ణయంకావడం, ఆత్మీయులను బంధువులను కలుసుకొనడం జరుగుతుంది. అనుకున్న పనులు నిదానంగా జరగడం, ఆటంకాలు కలిగి తొలగడం, తద్వారా టెన్షన్‌గా ఉండటం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరగడం, ఆర్థికవృద్ధి మరియు ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

అవసరాలకు ఋణాలు చేయవలసి వస్తుంది. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. దూరప్రయాణాలు, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. వృత్తి పరంగా గౌరవప్రతిష్టలు, ఆదాయం బాగుంటుంది. వ్యాపార విస్తరణ, క్రొత్త పెట్టుబడుల ప్రయత్నాలు సాగిస్తారు. వ్యాపారవర్గాలకు అవకాశాలు బాగుండి ఆదాయం పెరుగుతుంది. ఆరోగ్యం బాగుంటుంది.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ధ్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. షేర్లు, పెట్టుబడుల మీద ఆదాయం సంతృప్తికరంగా ఉండదు. బంధుముఖ్యులకు, ఆత్మీయులకు అనారోగ్య బాధలుంటాయి. గృహవస్తు వాహన రిపేర్ల ఖర్చులు పైనబడగలవు. అనుకున్న పనులకు పరిస్థితులు అనుకూలించి నెరవేరగలవు. మీ సలహాలు సూచనల వల్ల ఇతరులు లాభం పొందుతారు. ఆరోగ్యం ఫరవాలేదు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగ బాధ్యతలందు అదనపు పనిభారం ఉంటుంది. ఉద్యోగులు పబ్లిక్‌తో జాగ్రత్తపడాలి. స్థిరాస్తుల క్రయవిక్రయాలపై ఆలోచనలు చర్చలుంటాయి. రాబడికి తగ్గట్లు ఖర్చులు సర్దుబాటు చేసుకొంటారు. వ్యాపారవర్గాలకు ఆర్థికావకాశాలు వాయిదాపడే స్థితి ఉన్నది. వృత్తిపరంగా మంచి వ్యాపకం ఉంటుంది. బంధువర్గాలతో వివాదాలు రాకుండా చూసుకోవాలి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కీలక విషయాలపై బాగా ఆలోచించి నిర్ణయం చేయండి. వృత్తి ఉద్యోగాలలో పురోగతి, గౌరవ ప్రతిష్టలు బాగుంటాయి. ఆర్థికస్థితి బాగుండి రాబడిపై సంతృప్తి ఉంటుంది. ఇంటబయట స్త్రీలకు పురుషులకు సమస్యలుంటాయి. లౌకికముగా పరిష్కరించుకొనడం మంచిది. సోదరులకు మేలు చేకూరుతుంది. ఆస్థి వ్యవహారాలు పరిష్కారానికి రాగలవు. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలపై దృష్టిపెడతారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

అనుకోని అదనపు ఖర్చులుండినా ఇబ్బందులుండవు. అనుకున్న పనులను ధైర్యంగానే జరుపుకొంటారు. కుటుంబసభ్యులతో అరమరిక, సఖ్యత సరిగా ఉండకపోవచ్చును. ఉద్యోగులు, వ్యాపారులపై అధికారుల దాడులుండవచ్చును. వ్యాపారవృద్ధి అవకాశాలు మరియు ప్రయత్నాలు వాయిదా పడతాయి. వృత్తి జీవనము వారికి వ్యాపకం బాగుంటుంది.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 28.03.2014 నుండి తేది. 03.04.2014 వరకు ఈ వారము మీనంలో రవి, మేషంలో కేతువు, మిథునంలో గురువు, కన్యలో కుజ, తులలో శనిరాహువులు, మకరంలో శుక్రుడు, 31తేది నుండి కుంభంలో శుక్రుడు, కుంభంలో బుధుడు, కుంభమీనమేషవృషభ రాశుల్లో చంద్రుడు సంచరిస్తారు.**

### పంచాంగము:

మార్చి నెల 31తేది నూతన తెలుగు సంవత్సరాది ఉగాది.
ముహూర్తములు లేవు.

### ఫాల్గుణ మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | ద్వాదశి | ఉ॥గం6.30వ॥ |
| | పిదప | త్రయోదశి | రా॥గం4.15వ॥ |
| తేది. 29 | శని | చతుర్ధశి | రా॥గం2.15వ॥ |
| తేది. 30 | ఆది | అమావాస్య | రా॥గం.12.36వ॥ |

### జయసంవత్సర చైత్ర మాస శుక్ల పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 31 | సోమ | పాఢ్యమి | రా॥గం.11.15వ॥ |
| తేది. 01 | మంగళ | విదియ | రా॥గం.10.22వ॥ |
| తేది. 02 | బుధ | తదియ | రా॥గం.10.05వ॥ |
| తేది. 03 | గురు | చతుర్థి | రా॥గం.10.01వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అదనపు ఖర్చులు అనుకోకుండా పైనబడతాయి. దైవకార్యాలకు సహాయపడటం జరుగుతుంది. ఆస్థి వ్యవహారాలు వాయిదా వేసుకొనడం మంచిది. క్రొత్త వ్యాపారాలు, ప్రాజెక్టుకు అవకాశాలు అనుమతులుంటాయి. వ్యాపారవర్గాలకు ఆదాయము బాగుంటుంది. వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగులకు పనిభారం, అదనపు బాధ్యతలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఇతరుల వ్యవహారాలలోకిపోయి ఇబ్బందులుపడే అవకాశం ఉన్నది. రావలసిన బాకీలపై వత్తిడి పెంచండి. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. ఈ రాశి వారికి ఆదాయం సామాన్యం. ఖర్చులు పెరుగుతాయి. ఖర్చులపై అదుపుండదు. బంధుమిత్రులకు భేదాభిప్రాయాలుంటాయి. ఆర్థిక వ్యవహారాలలో తొందరపడవద్దు. దూరప్రయాణాలు రద్దుకాగలవు.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

పెట్టుబడులకు అవకాశాలు దొరుకుట, స్థిరాస్తుల మీద ఆదాయముంటుంది. సభలు సమావేశాలలోను, శుభకార్య నిర్ణయంలోను ప్రముఖంగా వ్యవహరిస్తారు. అనుకున్న పనులు సక్రమంగా జరుగుట, సమస్యలపై సంప్రదింపులు జరుపుట రాజీ చేసుకొనడం జరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాపకం పెరుగుట. ఆదాయవృద్ధికలదు. కోర్టు కేసులందు అనుకూలత కలదు.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుండినా సహచరులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్తగా మెలగండి. మాట తొందర తగ్గించుకొంటే అందరూ సహకరిస్తారు. మీరు చేసే అన్ని ప్రయత్నాలకు పరిస్థితులు అనుకూలించగలవు. ఆర్థిక లావాదేవీలు, క్రొత్త వ్యాపార ప్రయత్నాలు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలందు ఆదాయం పెరుగుతుంది. పరీక్షలు బాగా వ్రాస్తారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

షేర్లు పెట్టుబడులందు కొంత నిరుత్సాహం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు పొందగలరు. నిర్మాణాలు, రిపేర్లు చేపట్టిన వారికి అంచనాలకంటే ఖర్చులు ఎక్కువ కాగలవు. వృత్తి వ్యాపారాలలో సామాన్య ఆదాయం ఉంటుంది. పనులు చేసేటప్పుడు ముందు వెనుకలు ఆలోచించి చేయండి, లేకుంటే విమర్శనలను ఎదుర్కొనవలసి వస్తుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆదాయము వ్యాపారవర్గాలకు సామాన్యం. ప్రభుత్వ అనుమతులు, కాంట్రాక్టులు, లీజు వ్యవహారాలు వాయిదా పడతాయి. ఖర్చులు పెరిగి ఆర్థికంగా ఇబ్బందిపడతారు. గాయాలు, బెణుకులు అనారోగ్య బాధలుండగలవు. వృత్తి పరంగా వ్యాపకం పెరిగి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు మంచి అవకాశాలు వాయిదాపడవచ్చును. కోర్టు వ్యవహారాలు వాయిదాపడతాయి.

# శ్రీ జయ ఉగాది

కె.వి.నాగేశ్వరరావు
కోవూరు,
సెల్.9963662699

***బ్రహ్మదేవుని సృష్టితోనే కాలపరిగణ ప్రారంభము. అందువల్ల యుగారంభం కూడా సంవత్సరారంభంతోనే ప్రారంభమైంది కనుక ఆ దినం "యుగాది" "సంవత్సరాది" పర్వదినమైంది. యుగాదికి వికృతి "ఉగాది". యుగము అనగా జంట. ఉత్తరాయణ దక్షిణాయణముల జంటను సంవత్సరంగా భావిస్తే యుగాది ఆ జంటకు సంవత్సరానికి ఆది.***

చైత్రశుక్లపాడ్యమి 'ఉగాది' ఇది ఋతువులకు, మాసములకు, పక్షములకు, తిథులకు సంబంధించినది. ఋతువులలో ఆదిదైన వసంత ఋతువు, మాసాల్లో మొదటిదైన చైత్రమాసం, పక్షాల్లో మొదటిదైన శుక్ల పక్షము, తిథులలో మొదటిదగు పాడ్యమి ఈ విధంగా ఆదులన్నీ కలసి యుగాది అయింది.

సృష్టికర్త బ్రహ్మదేవుడు ఈ జగత్తును వసంత ఋతువులో చైత్రశుక్ల పాడ్యమి తిథినాడు సూర్యోదయ కాలంలో సృష్టించాడు. కాలగణనను ఆనాటి నుండి ప్రారంభించారు అని "చతుర్వర్గ చింతామణి" అను గ్రంథములో హేమాద్రి పండితుడు పేర్కొన్నాడు. ధర్మసింధు కారకులైన కాశీనాథ ఛటోపాధ్యాయుడు స్మృతి కౌస్తుభ కారకుడైన అనంత దేవుడు, నిర్ణయ సింధుకారకుడు కమలాకరభట్టు, చైత్ర శుద్ధ పాడ్యమి తిథి "ఉగాది" సంవత్సరాది అని పేర్కొన్నారు.

చాంద్రమానాన్ని అనుసరించిన ఉగాది మనది. అనగా శుద్ధపాడ్యమి నుండి అమావాస్య వరకు నెల అని పరిగణించే వారికి సంవత్సరాది. ఆంధ్రులే కాక కన్నడ రాష్ట్ర వాసులు, మహారాష్ట్ర ప్రజలు చైత్ర శుద్ధ పాడ్యమిని 'ఉగాది'గా సంవత్సరాదిగా భావిస్తారు. తిథి వార నక్షత్రకరణ యోగాలు అనుపంచ అంగాలను వివరించేది పంచాంగం. కాలస్వరూపుడగు జగన్నాథుడు నివాసముండేది తిథి. ఒక గ్రహం ఆ దైవాన్ని సేవిస్తూ ప్రదక్షిణ చేసే దినం వారం. క్షతం కాకుండా రక్షించేది నక్షత్రం, చంద్రుడు నక్షత్రంతో కలసి ఉండే కాలం యోగం. కరణమంటే సాధనం.

మానవులకు పంచాంగం శుభాశుభ ఫలితాలను ప్రతిబింబింపజేసే దర్పణం. దైవం తనను ఆకర్షించే గ్రహం, అవి కలిసియున్న నక్షత్రం ఈ విధంగా కలిసియున్నందున కలిగే ఫలితం, అది ఏయే కార్యాలకు సాధకమవుతుందో మొదలైన విషయాలు జ్యోతిష్యశాస్త్రంలో నిర్వచించారు. ఉగాది నాడు పంచాంగ శ్రవణం చేసే వారికి సూర్యుడు శౌర్యాన్ని, చంద్రుడు ఇంద్రవిభవాన్ని, కుజుడు శుభాన్ని, శని ఐశ్వర్యాన్ని, రాహువు బాహుబలాన్ని కేతువు కులాధిక్యతను కల్గిస్తారు. ఉగాదినాడు మానవులు తమ జన్మఫలాలను నూతన పంచాంగం ద్వారా తెల్సుకుని ప్రణాళికలను రూపొందించుకుంటారు. ఉగాది పండుగకు గల ప్రత్యేకత ఉగాది పచ్చడి. ఈ ఉగాది పచ్చడి వేపపువ్వు, బెల్లం, చింతపండు, మామిడి ముక్కలు, నేయి, పచ్చి మిర్చి, ఉప్పు, మొదలగు షడ్రుచుల సమ్మేళితం.


ఈ ఉగాది పచ్చడి సేవనం ఎంతో ఆరోగ్యప్రదం. ఉగాదికి గల మరో ప్రత్యేకత ప్రతి సంవత్సరం ఒక ప్రత్యేకమైన పేరుతో పిలవబడడం. సంవత్సర నామంతో ఆ విధంగా ఉగాది 60పేర్లతో 'ప్రభవ' మొదలు 'అక్షయ' వరకూ పిలవబడుతోంది. ఇది శ్రీజయ నామ సంవత్సర ఉగాది.

# సస్పెండ్ అయిన డిఎంహెచ్ఓ సుధాకర్

నెల్లూరు జిల్లా వైద్యశాఖలో డిఎంహెచ్ఓగా పనిచేస్తుండిన డాక్టర్ సుధాకర్‌ను ఎట్టకేలకు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ సంవత్సరం జనవరి 21న డాక్టర్ సుధాకర్‌ను ఒంగోలు పోలీసులు, అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఒక ఉన్నత అధికారిగా పనిచేసే అధికారిని అరెస్ట్ చేసారంటే అవినీతికి పాల్పడ్డాడనో, లంచం అడిగాడనో అరెస్ట్ చేసుంటారనుకుంటాం. కాని అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తే విధంగా ఈ ప్రబుద్ధుడు ఒక వ్యక్తిని హత్య చేసేందుకు కుట్రపన్నినట్టు ఆరోపణలు రావడం జరిగింది. అవి నిజమేనని విచారణలో తేలడంతో కేసు వివరాలను పోలీసులు ప్రభుత్వానికి అందజేయడంతో వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు డా॥సుధాకర్‌ను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా నెల్లూరు నగరం వదిలివెళ్ళరాదని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

### సింహపురిలో భారీ ఏర్పాట్లతో

# శ్రీ మహాలక్ష్మీ యాగం



ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో సిద్ధమవుతున్న యాగశాల

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఏప్రిల్ 7 నుండి 14వతేది వరకు నిర్వహించనున్న శ్రీ మహాలక్ష్మీయాగమునకు సంబంధించి ఈనెల 23న జరిగిన విలేకరుల సమావేశంలో శ్రీ రామచంద్రజీయర్‌స్వామి భిక్షాటన పర్యటన వివరాలను తెలిపారు. ఈనెల 23న భక్తవత్సలనగర్, 24న వేదాయపాలెం నుండి ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వరకు, 25న పెద్దబజారు, చిన్నబజారు, మండపాలవీధి, ఆచారివీధి, కాపువీధి, 26న మాగుంటలే అవుట్, 27న రాజరాజేశ్వరి గుడి, జడ్పీకాలనీ, డైకస్‌రోడ్డు, పొదలకూరు రోడ్డు, 28న మూలాపేట, 29న కోటమిట్ట, కుక్కలగుంట, మనుమసిద్ధినగర్, 31న బాలాజీనగర్, ఏప్రిల్ 1న ఆత్మకూరు బస్టాండు నుండి విఆర్‌సి సెంటర్ వరకు, ఏప్రిల్ 2న సంతపేట గుప్తా పార్కు, రంగనాయకులపేట ప్రాంతాలలో భిక్షాటన పూర్వక పాదయాత్ర సాగుతుందని తెలిపారు. ఏప్రిల్ 7సాయంత్రం 4గంటలకు మాగుంట లే అవుట్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం నుండి దర్గామిట్టలోని ఏసిస్టేడియం వరకు 10రాష్ట్రముల నుండి వచ్చే దాదాపు 1000 మంది కళాకారులతో, భక్తులతో పెద్ద ఊరేగింపు జరుగుతుందని తెలిపారు.

8న కలశాభిషేకం, అంకురార్పణ, 9న అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణ తదుపరి చతుస్థానార్చన, సుదర్శనేష్టి, 11న పుత్రకామేష్టి, లక్షకుంకుమార్చన సాయంత్రం లక్ష ఒత్తుల దీపోత్సవం, 12న వైభవేష్టి, లక్షతులసి, బిల్వ పత్రార్చనలు, 13న క్షీరార్ణవ మంటపంలో 108ఆరగింపులు, అమ్మ వారికి తిరునక్షత్రోత్సవము, సువర్ణపుష్పార్చన, లక్ష్మీనారాయణవేష్టి, మహాపూర్ణాహుతి సాయంత్రం 6గంటలకు భూగోదాసమేత గోవింద పెరుమాళ్ళకు ముత్యములతో కల్యాణోత్సవం జరుగుతాయని తెలిపారు.

# కోకిలమ్మ పదాలు


అదృష్టదీపక్
రామచంద్రాపురం,
94405 28155



ప్రజాస్వామ్యపు ముసుగు
ప్రభుత నిండా లొసుగు
పుట్టించెనిక విసుగు
ఓ కోకిలమ్మా!



ఎన్నికలలో నోట్లు
ఇచ్చి పొందిన వోట్లు
ఇండియాలో కోట్లు
ఓ కోకిలమ్మా!



భావిప్రగతికి రూటు
నీవు వేసే వోటు
అమ్ముకుంటే చేటు
ఓ కోకిలమ్మా!



అంతరాత్మను చంపు
రాజకీయపు కంపు
పార్టీ ఫిరాయింపు
ఓ కోకిలమ్మా!



కల్లబొల్లి కబుర్లు
కడుపునిండా దొర్లు
నాయకులు జోకర్లు
ఓ కోకిలమ్మా!



కుడిఎడమ పనిలేని
కుప్పిగంతుల వాని
మాట వింటే హాని
ఓ కోకిలమ్మా!



తన శరీరము క్రింద
నలుపున్న గురివింద
చేసెనట పరనింద
ఓ కోకిలమ్మా!



వట్టి మాటలు దంచి
కట్టుకథల విపంచి
కడకు చేరును కంచి
ఓ కోకిలమ్మా!

## సింహపురి గ్రామదేవత

# ఉగాది నిజరూపదర్శనం

సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి దేవస్థానంలో ఈ నెల 31న ఉగాది పర్వదిన సందర్భంగా అమ్మవారి నిజరూపదర్శనం చందనా లంకారంతో వుంటుందని ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ.వి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆరోజు అమ్మవారికి పూలంగిసేవ జరుగుతుందని ఉభయకర్తలుగా దంపతులు నెల్లూరు సురేష్, రేఖలు వ్యవహరిస్తారని తెలిపారు. ప్రసాదాలు వితరణ అన్నదానం కాకర్లవారివీధి మిత్రమండలి ఆధ్వర్యంలో జరుగుతుందని, సాయంత్రం ప్రత్యేక పుష్పాలంకరణతో తెనాలి బ్యాండు, తప్పెట్లు, చెన్నై బ్యాండ్, బాణాసంచా, విద్యుత్‌దీపాలంకరణలతో అమ్మవారి నగరోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. ఉభయకర్తలుగా చెన్నైకు చెందిన ధనలక్ష్మి జ్యూయలరీ గిరీష్‌కుమార్‌జైన్, మాజీచైర్మెన్ ఇందుకూరు రమేష్‌కుమార్, మాజీ ధర్మకర్త మెట్టు సురేష్‌బాబులు వ్యవహరిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సాయంత్రం 6గంటలకు తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానం నుంచి అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, సారె అందుతాయని తెలిపారు. భక్తులు ఈ ఉగాది మహోత్సవంలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షములు పొందమని కోరారు.

## ఎన్నికల పరిశీలకులుగా రవిచంద్ర



మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల పరిశీలకులుగా వారంరోజులు నెల్లూరులో విధులు నిర్వహించిన మురళిని అనంతపురం జిల్లాకు బదిలీచేసిన ఎన్నికల సంఘం, సీనియర్ ఐఏఎస్ అధికారి రవిచంద్రను నెల్లూరులో ఎన్నికల పరి శీలకులుగా నియమించింది. రవిచంద్ర గతంలో నెల్లూరుజిల్లా కలెక్టర్‌గా కూడా పనిచేసి వున్నారు.

## డిప్యూటీ కమీషనర్‌గా ఏవీవీ భద్రరావు

గుంటూరుజిల్లా నరసారావుపేట పురపాలక సంఘ కమీషనర్‌గా పనిచేస్తుండిన ఏవీవీ భద్రరావును నెల్లూరు కార్పొరేషన్ డిప్యూటీ కమీషనర్‌గా బదిలీ చేసారు. ప్రస్తుతం కార్పొరేషన్ వాటర్ ఎంఈ శ్రీనివాసరావు డిప్యూటీ కమీషనర్ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

## వేసవి శిక్షణకు క్రీడాకారులకు ఆహ్వానం

నెల్లూరుజిల్లా క్రీడా ప్రాధికారసంస్థ ఆధ్వర్యంలో మే నెల 1 నుంచి 31వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాధికారి ఆర్.కె.ఎతిరాజ్ తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని, జిల్లా కేంద్రంలోని క్రీడాకారులకు పలు క్రీడాంశాల్లో శిక్షణనిస్తామని పేర్కొన్నారు. జాతీయస్థాయి సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు ఈ శిక్షణా శిబిరాలు నిర్వహించేందుకు దరఖాస్తు చేసుకోమని ఆహ్వానించారు. వారు పూర్తి వివరాలతో పోస్టు ద్వారా గాని, స్వయంగా గాని దరఖాస్తులను జిల్లా క్రీడాప్రాధికారసంస్థ కార్యాలయానికి అందేలా చూడాలని తెలిపారు. శిక్షణా శిబిరాలలో క్రీడాపరికరాలు ఉచితంగా అందిస్తామని, శిబిరంలో పాల్గొన్న క్రీడాకారులకు ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు.

# వైభవంగా ముత్యాలమ్మ జాతర



నెల్లూరుజిల్లాలోని చిల్లకూరు మండలంలోని మారుమూల గ్రామమైన తూర్పు కనుపూరు పేరు ఒకప్పుడు అనుకునే వారు లేరు. కాని నేడు మహిమగల తల్లి ముత్యాలమ్మ జాతరతో మన రాష్ట్రంలోనే గాక పరిసర రాష్ట్రాలలో కూడా ప్రాచుర్యం పొందింది. ప్రతిఏటా వైభవంగా జరిగే ఈ జాతర ఈ నెల 25న మొదలైంది. రెండో రోజు బుధవారానికి వివిధ ప్రదేశాల నుంచి తరలివచ్చిన భక్తులతో తూర్పుకనుపూరు కళకళలాడింది. ఉదయాన్నే గంగమిట్ట మీద ముత్యాలమ్మ సోదరి పోలేరమ్మను ప్రతిష్టించగా భక్తులు కుంభం పోసి మొక్కులు తీర్చుకున్నారు. కోట మండలం సిద్ధవరంలో కుమ్మరి ఇంట రూపొందిన పోలేరమ్మ విగ్రహాన్ని డంబలోళ్ళ వాయిద్యాలు, డప్పుల ధ్వనులతో ఊరేగింపుగా గణాచారి తీసుకొచ్చారు. సత్తిపోలేరమ్మ, అంకమ్మ, సిద్ధలయ్య, పరశురాముడులతో పోలేరమ్మను ఊరేగించారు. సాయంత్రం గంగపెట్టి, వీరతాళ్ళతో గొల్లలు వీధుల్లో పోతుండగా యార, శ్రీ గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవాన్ని భక్తిపూర్వకంగా నిర్వహించారు. గురువారం ఉదయం గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాలసేవ వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వరిదిరెడ్డి రామమోహన్‌రెడ్డి, సభ్యులు చిట్టేట నారాయణ, భీమిరెడ్డి మదన్‌కుమార్‌రెడ్డి, అబ్బాయి శివకుమార్, దువ్వూరు రామచంద్రారెడ్డి, సింహాద్రి మదనమోహన్, దేవాదాయశాఖ ఏసీ రవీంద్రరెడ్డి, ఈఓ తాతా శ్రీనివాసరావులు జాతరను పర్యవేక్షించారు.

# పెన్షనర్ల పట్ల పార్టీల నిర్లక్ష్యం



రామానుజాచార్యుల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యఅతిథులు



నెల్లూరు భక్తవత్సలనగర్‌లో రామానుజాచార్యుల రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జిల్లా శాఖ సంక్షేమ భవనాన్ని ముఖ్యఅతిథిగా పాల్గొన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణమూర్తి ఈ నెల 26న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన పెన్షనర్లకు ఎంతో ఇబ్బందిగా మారిందని, దాని కారణంగా పీఆర్సీ, డీఆర్, హెల్త్‌కార్డులు ప్రక్రియ వెనక్కి వెళ్ళిందని బాధపడ్డారు. ఎన్నికలప్పుడు పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పార్టీల నాయకులు మరిచిపోతారని, నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఆనాడు టీడీపీ పాలనలో పెన్షనర్లు ఎంతో ఇబ్బందిని ఎదుర్కొన్నారని, చివరికి కరువు భత్యాన్ని కూడా ఇవ్వకుండా చంద్రబాబు నిరంకుశంగా వ్యవహరించారని అన్నారు. పెన్షనర్లపై ఏ ప్రభుత్వమైనా చిన్నచూపు చూడడం తగదని పేర్కొన్నారు. తదుపరి భవన ప్రాంగణంలో రామానుజాచార్యుల కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సహఅధ్యక్షుడు సోమేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు డాక్టర్ మోహన్‌రావు, జిల్లా కార్యదర్శి కొండాచారి తదితరులు పాల్గొన్నారు.

# ఆలోచింపజేసిన రెయిన్‌బో విద్యార్థుల ప్రదర్శన



నెల్లూరులోని ఏనుగు సుందరరామిరెడ్డి ఆడిటోరియంలో ఈ నెల 26న రోటరీక్లబ్ సభ్యుల సమక్షంలో రెయిన్‌బో స్కూలు విద్యార్థినులు "స్త్రీ, శిశు భ్రూణహత్యలు" అంశంపై ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో స్త్రీ, శిశు, భ్రూణ హత్యలు సమాజం మీద ఎంత దుష్ప్రభావాన్ని చూపిస్తున్నాయో కళ్ళకు కట్టినట్లుగా విద్యార్థినులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా రోటరీక్లబ్ నెల్లూరు ప్రెసిడెంట్ టి.శేఖర్, సెక్రటరీ కె.ప్రతాప్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ సమాజంలో స్త్రీల పాత్ర ఔన్నత్యాన్ని చాటిచెప్పే విధంగా ఈ ప్రదర్శన వుందని పేర్కొన్నారు. విద్యార్థినులు ఆర్చి, అన్షు, తమన్నా, మౌక్తిక, కార్తీక, హమ్సినిలు, ఉపాధ్యాయినులు రేఖ, సత్యవతిలు ప్రదర్శనలో పాల్గొనగా రొటేరియన్ కొడవలూరు ధనుంజయరెడ్డి వారికి జ్ఞాపికలను అందించారు.

# నువ్వా - నేనా

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్, సీపీఎం, బీజేపీలు కీలకంగా మారే అవకాశాలున్నాయి. ఈసారి ఇండిపెండెంట్లు రెండు, మూడు చోట్ల మాత్రమే బలమైన ప్రభావం చూపుతున్నారు. కాబట్టి కాంగ్రెస్, బీజేపీ, సీపీఎంల కొచ్చే ఓట్లు కీలకం కాగలవు.

తెలుగుదేశం చూస్తే ప్రచారంలో ముమ్మరంగా ఉంది. నామినేషన్లు వేసిన రోజునుండే ప్రచారంలో కాళ్లకు బలపాలు కట్టుకుని తిరుగుతున్నారు. ప్రచారంలో వైసిపి అభ్యర్థులు కూడా జోరుగా ఉన్నారు. ఇరు పార్టీల అభ్యర్థులు ఇంటింటి ప్రచారాలను పూర్తి చేసారు. ఓటరు లిస్టు గందరగోళంగా మారడంతో అభ్యర్థులకు పెద్ద సమస్యగా మారింది. డివిజన్ ప్రాంతం ఒక చోట, ఓటర్లు ఇంకోచోట వుండడంతో అభ్యర్థులకు వారిని వెదుక్కోవడం పెద్ద పనయ్యింది. తెలుగుదేశం అభ్యర్థులకు మద్దతుగా సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, బీద రవిచంద్ర, టి.రమేష్‌రెడ్డి, అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిలారి వెంకటస్వామినాయుడులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వైసిపి అభ్యర్థులకు మద్దతుగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, సన్నపరెడ్డి పెంచలరెడ్డి వంటి నాయకులు ప్రచార బాధ్యతలు నిర్వర్తించారు. కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచార బాధ్యతనంతా ఆనం వివేకానందరెడ్డి, భానుశ్రీలే చూసారు. మొత్తానికి ప్రచారపర్వం పూర్తయ్యింది. ఇక పోలింగ్, కౌంటింగ్ మిగిలింది. కోర్టు కౌంటింగ్‌ను వాయిదా వేయకుంటే ఏప్రిల్ 2వతేదీన ఎవరి భవిష్యత్తు ఏంటో తేలిపోతుంది.

# కమలం లేకుంటే కష్టమే

(మొదటిపేజీ తరువాయి)

దానిపై చంద్రబాబు పునరాలోచనలో పడ్డాడు. ఎలాగూ మైనార్టీలు జగన్‌తో వెళ్లిపోయారు కాబట్టి బీజేపీతో పొత్తుపెట్టుకుంటే కొత్తగా వచ్చే నష్టమేమీ లేదని భావించిన చంద్రబాబు ఆ దిశగా సంకేతాలు పంపారు. అయితే, ఈ సమయంలో మోడీ ఇమేజ్‌ను అతిగా అంచనా వేస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకులు కొండెక్కి కూర్చున్నారు. తెలంగాణలో సీఎం పదవితో పాటు మెజార్టీ అసెంబ్లీ టిక్కెట్లు డిమాండ్ చేసారు. సీమాంధ్రలో శక్తికి మించి సీట్లడిగారు. వాస్తవంగా బీజేపీవి గొంతెమ్మకోర్కెలే! 1999లో వాటికి అదనంగా ఓ రెండుమూడు సీట్లు అడిగితే సరిపోయేది గాని మరీ ఎక్కువగా అడిగారు. చంద్రబాబు తగ్గి రాకపోవడంతో పొత్తుల వ్యవహారం బెడిసింది. బీజేపీ వాళ్లు అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించడం కూడా మొదలుపెట్టారు.

టీడీపీతో బీజేపీ కావాలనే పొత్తుకు ఎగ్గొట్టిందని ఒక వాదన. టీడీపీతో పొత్తు లేకపోతే రేపు సీమాంధ్రలో వైకాపాకు వచ్చే లోక్‌సభ సీట్లు, తెలంగాణలో టీఆర్ఎస్ సీట్లు తమకు మద్దతుగా చేరుతాయని బీజేపీ నాయకత్వం భావిస్తుంది. టీడీపీతో పొత్తు వుంటే ఆ పార్టీలు బీజేపీతో కలవకపోవచ్చు. అందుకే తెలుగుదేశంను పక్కకు తప్పించడానికే అతిగా సీట్లు కోరారనేది సమాచారం.

# అసాధ్యమనుకున్నది సుసాధ్యం చేసిన శ్రీసిటీ

**- షార్ మాజీ సంచాలకులు కాటూరి నారాయణ**



నెల్లూరు, చిత్తూరు జిల్లాల సరిహద్దులో వున్న పారిశ్రామిక వాడ శ్రీ సిటీలో వున్న చిన్మయ విద్యాలయం మూడవ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 23న సముచితరీతిలో జరిగాయి. విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరి మన్ననలు పొందాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా షార్ మాజీ సంచాలకులు కాటూరు నారాయణ, రాష్ట్ర రహదారులు, భవనాలశాఖ మాజీ చీఫ్ ఇంజనీర్ పరంధామరెడ్డి, వరదయ్యపాళెం మండల విద్యాశాఖాధికారి మునిసుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ ఉమాకల్యాణం, ప్రిన్సిపాల్ హరిత తదితరులు పాల్గొన్నారు. షార్‌మాజీ సంచాలకులు నారాయణ మాట్లాడుతూ శ్రీసిటీ పారిశ్రామికవాడను ఏర్పరిచి ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే కాకుండా, ప్రజల సమగ్రాభివృద్ధికి కృషిచేస్తామన్న శ్రీసిటీ యాజమాన్యం సంకల్పం ఏడేళ్ళ క్రితం విని అది అసాధ్యమనుకున్నానని, కాని దాన్ని సుసాధ్యమని ఐదేళ్ళలోపే చేసి చూపించిన శ్రీసిటీ యాజమాన్యం, ముఖ్యంగా కార్యనిర్వాహక సంచాలకులు రవీంద్ర సన్నారెడ్డి అభినందనీయులని అన్నారు. వారి కృషి ఫలితంగా మంచి విద్య, వైద్యం సామాన్యులకు సైతం అందుబాటులోకి వచ్చాయని పేర్కొన్నారు. పరంధామరెడ్డి మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలో విద్యనందించే చిన్మయ విద్యాలయం వెనుకబడిన ప్రాంతంలో నెలకొల్పడం ఈ ప్రాంత విద్యార్థులకు గొప్ప వరమన్నారు.




# కాంగ్రెస్‌ను ఎవరూ కాజేయలేరు

**బస్సుయాత్రలో కాంగ్రెస్ నేతలు**



కార్యకర్తలతో చర్చిస్తున్న చిరంజీవి

సీమాంధ్రలో కాంగ్రెస్‌పార్టీని బలోపేతం చేసే దిశగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు చేపట్టిన బస్సుయాత్ర 25వ తేదీ నెల్లూరు చేరుకుంది. కస్తూరిదేవి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కేంద్ర మంత్రి, కాంగ్రెస్‌పార్టీ సీమాంధ్ర ప్రచార సారథి చిరంజీవి మాట్లాడుతూ కాంగ్రెస్‌ను అంతు చేయాలనుకుంటే అది సాధ్యం కాదని, కాంగ్రెస్‌ను భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చిన ఎంతోమంది తమ రాజకీయ జీవితాలనే భూస్థాపితం చేసుకున్నారని చెప్పారు. రాష్ట్ర విభజనలో కాంగ్రెస్ చేసిన తప్పేమీ లేదని, అన్ని పార్టీలు విభజనకు లేఖనిచ్చాకే కాంగ్రెస్ విభజన నిర్ణయం తీసుకుందన్నారు. అనివార్యంగా విభజన జరిగినా అది ఒకరకంగా సీమాంధ్రకే ప్రయోజనం కలిగిస్తుందని ఆయన చెప్పారు. కన్నతల్లికి, జన్మనిచ్చిన నెల్లూరుకు ఎంతో ఋణపడి ఉన్నానని, ఇక్కడ కాంగ్రెస్‌పార్టీ పటిష్టానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం వల్లే కాంగ్రెస్ కార్యకర్తల్లో నిరుత్సాహం ఏర్పడుతుందని ఇలాంటి దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన కోరారు. కాంగ్రెస్ వల్లే సీమాంధ్రకు స్వయంప్రతిపత్తి వచ్చిందని, పోలవరం ప్రాజెక్ట్ దక్కిందని అన్నారు.

ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు రఘువీరారెడ్డి, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి, కేంద్రమంత్రులు పనబాక లక్ష్మి, పల్లంరాజు, జె.డి.శీలం, ఎంపీ చింతామోహన్, మాజీమంత్రులు బాలరాజు, డొక్కా మాణిక్య వరప్రసాద్, డీసీసీ అధ్యక్షులు కొడవలూరు ధనుంజయరెడ్డి, ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, మాజీ మేయర్ భానుశ్రీ, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, చాట్ల నరసింహారావు, మాదాసు గంగాదరం, ఆనం విజయకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## ఊపందుకున్న పురపాలక సంఘ ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న వైయస్సార్సీపీ చైర్మెన్ అభ్యర్థి ఎల్లసిరి గోపాల్‌రెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న తెలుగుదేశంపార్టీ చైర్మెన్ అభ్యర్థి పొనకా దేవసేన

గూడూరు పురపాలక సంఘ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది ఈనెల 30న జరగనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా ప్రచారానికి కేవలం అతి తక్కువ రోజుల సమయం ఉంది. దీంతో ఎన్నికల బరిలో ఉన్న వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థులు, మద్దతుదారులు ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు. రెండో పట్టణ పరిధిలోని 25వవార్డులో వైఎస్సార్ పార్టీ సీఈసీ సభ్యుడు చైర్మెన్ ఎల్లసిరి గోపాల్‌రెడ్డి ప్రచారం ఊపందుకుంది. ఒకటవ పట్టణంలోని 17వ వార్డులో తెలుగుదేశం పార్టీ తరపున చైర్మెన్ అభ్యర్థిగా వున్న పొనకా దేవసేన ప్రచారం ఊపందుకొంది. గూడూరు పట్టణంలో కాంగ్రెస్ అభ్యర్థుల తరపున కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పనబాక కృష్ణయ్య ఆదివారం, సోమవారం నాడు ప్రచారం చేశారు. పట్టణ పుర ఎన్నికల్లో బరిలో నిలిచిన 7,9,11వార్డుల అభ్యర్థుల తరపున సీపీఎం డివిజన్ కార్యదర్శి కటికాల వెంకటేశ్వర్లు స్థానికపార్టీ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. సిపిఐ డివిజన్ కార్యదర్శి మండ్ల రాజేష్‌కుమార్ సతీమణి రాధిక 26వవార్డు కౌన్సిలర్‌గా ప్రచారంలో ముందున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పనబాక కృష్ణయ్య

## క్షయ బాధితులకు ఉచిత మందులు

గూడూరు పట్టణంలోని ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి ఆవరణ పరిసరప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వారం రోజులుగా ఆగకుండా దగ్గేవారు వెంటనే వైద్యులను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. క్షయను నివారించేందుకు ప్రభుత్వం ఉచితంగా మందులను అందజేస్తుందన్నారు. క్లస్టర్ వైద్యులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ వర్కర్స్ సిబ్బంది పట్టణంలో పలువీధుల్లో క్షయపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ప్రజారోగ్యాధికారి డా॥పి.ఎల్. దయాకర్, వైద్యులు బాబురావు, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.

## దేశం మున్సిపల్ చైర్మెన్ అభ్యర్థిగా దేవసేన



తెలుగుదేశం పార్టీ చైర్మెన్ అభ్యర్థి పొనకా దేవసేనను పరిచయం చేస్తున్న ఎమ్మెల్యే బల్లి

గూడూరు పురపాలక సంఘ తెలుగుదేశం పార్టీ చైర్మెన్ అభ్యర్థిగా 17వవార్డు నుంచి పోటీ చేస్తున్న పొనకా దేవసేనను మాజీ ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు ప్రకటించారు. గూడూరు పట్టణంలోని పీవీఆర్ కల్యాణ మండపంలో సోమవారం రాత్రి ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ఆ మేరకు వివరాలను వెల్లడించారు. వైస్ చైర్మెన్ పదవికి పార్టీ నుంచి శీలం కిరణ్‌కుమార్ బరిలో ఉన్నట్లు ఈ సందర్భంగా వెల్లడించారు. పార్టీ నాయకులు కోడూరు శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎమ్మెల్యే తనయుడు బల్లి కల్యాణ్, మధురెడ్డి, పొనకా శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేతలకు స్వాగతం పలుకుతున్న పట్టణ సమస్యలు




గూడూరు మున్సిపల్ కార్యాలయం

గూడూరు పురపాలక సంఘ పరిధిలో సమస్యలు తిష్ట వేశాయి. ఎన్నికల్లో పోటీచేసిన నేతలకు అవి స్వాగతం పలుకుతున్నాయి. ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలు తమదైన శైలిలో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. నేతలు వీధివీధినా తిరుగుతున్నారు. సమస్యలపై ప్రజలు తమ గళం విప్పుతున్నారు. ముఖ్యంగా పట్టణంలో తాగునీటికి, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, మురుగు కాలువలు రోడ్లు అభివృద్ధి, ఫించన్లు, వీధిదీపాలు తదితర సమస్యలతో ఎదురుచూస్తోంది. ఈసారి ఎన్నికల్లో విజయం సాధించి మున్సిపల్ చైర్మెన్ పదవిని దక్కించుకున్న వారైనా చొరవచూపి సమస్యల నుంచి గట్టెక్కిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

## పార్టీ విజయానికి కృషిచేయాలి

నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పార్టీ విజయానికి కృషిచేయాలని వైకాపా నాయకులు వేమారెడ్డి కుమారస్వామిరెడ్డి, సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, యద్దల మధుసూదనరెడ్డి కోరారు. ఎంపిటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో వైకాపా తరపున పోటీచేస్తున్న అభ్యర్థులకు సోమవారం చిల్లకూరులో బి-ఫారాలను అందజేశారు. కాగా జెడ్పీటీసీ అభ్యర్థిగా మండలంలోని చినకటువపల్లి గ్రామానికి చెందిన ఓడూరు యమునమ్మ ఎంపిపి అభ్యర్థిగా చింతవరం నుంచి పోటీలో ఉన్న చేవూరు నాగరాజులను ప్రకటించారు. కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, గోపీచంద్, చిల్లకూరు సర్పంచ్ నెల్లూరు రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ న్యాయవాదిగా చలపతిరావు



గూడూరు రెండో పట్టణ పరిధిలోని సివిల్ జడ్జి కోర్టులో సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న యరగుడిపాటి చలపతిరావు 7వ అదనపు జడ్జి కోర్టుకు ప్రభుత్వ న్యాయవాదిగా పదోన్నతి కల్పిస్తూ నియమించినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ అయినట్లు తెలిపారు. వారి నియామకం పట్ల పట్టణ న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

## కనుపూరు ముత్యాలమ్మ హుండీ లెక్కింపు



గూడూరు డివిజన్‌లోని చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో వెలసియున్న ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ హుండీ లెక్కింపును శనివారం అధికారులు చేపట్టారు. మూడు నెలల నుంచి భక్తులు హుండీ ద్వారా అమ్మ వారికి సమర్పించిన కానుకలు రూ.5.60లక్షలు ఉన్నట్లు గుర్తించారు. లెక్కింపు కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ వరిదిరెడ్డి రామమోహన్‌రెడ్డి, దేవా దాయశాఖ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఈవో తాతా శ్రీనివాసరావు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పాలకుడిగా కాదు.. సేవకుడిగా ఉంటాను!



తెలుగుదేశంపార్టీ
మేయర్ అభ్యర్థి
డా॥ జడ్. శివప్రసాద్

నెల్లూరు నగరపాలక సంస్థ ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ మేయర్ అభ్యర్థిగా డా॥ జడ్. శివప్రసాద్ బరిలో నిలిచారు. ఆయన 8వ డివిజన్ నుండి 'దేశం' అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. సౌమ్యుడు, స్నేహశీలి అయిన డా॥ జడ్.యస్.కు నెల్లూరు పట్ల, నెల్లూరు సమస్యల పట్ల ఎంతో అవగాహన వుంది. విద్యావంతుడు కావడం, గతంలో ఉచిత వైద్యశిబిరాల ద్వారా ప్రజలకు సుపరిచితుడు కావడంతో తెలుగుదేశం అధిష్టానం సైతం మేయర్ అభ్యర్థిగా ఆయనను ఎంపికచేసింది. ప్రజలు తెలుగుదేశంపార్టీని గెలిపిస్తే, నెల్లూరు నగరంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తానని, మున్సిపాల్టీలో అనుభవం వున్న వారిని, కొత్త వారిని కలుపుకొని ఒక మంచి పరిపాలనను అందించి, సమస్యల నుండి ప్రజలకు విముక్తి కల్పిస్తామని ఆయన చెప్పుకొచ్చారు. తాను మేయర్ అయితే ఏఏ అంశాలను చేపడతాడనేది ఆయన మాటల్లోనే తెలుసుకుందాం...

కార్పొరేషన్ నిధులను ప్రజాభీష్టం మేరకు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించి అవినీతి రహిత, పారదర్శక పాలన అందిస్తాం. కార్పొరేషన్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్దిష్ట కాలంలో వారి పనులు పూర్తి చేయబడతాయి.

దీర్ఘకాలం అపరిష్కృతంగా ఉన్న 'డ్రైనేజీ' సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి 'భూగర్భడ్రైనేజీ'ని సాధించి నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తిచేస్తాం. నగరంలో, నగర పరిధిలోని శివారు ప్రాంతాలలో డ్రైనేజీ కాలువలు నిర్మించి నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్లను ఏడాదిలోపు పూర్తి చేస్తాం. ముఖ్యంగా దోమల నిర్మూలనకు అధికప్రాధాన్యతనిచ్చి సీజనల్ వ్యాధుల నిర్మూలనకు ఒక డాక్టర్‌గా కృషి చేస్తాం. నగర శివారు ప్రాంతాల్ని కలుపుతూ రింగ్‌రోడ్లు, కల్వర్టులు, అవసరమైన చోట్ల ఫ్లైఓవర్‌లు, సబ్ వేలు నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ తయారుచేసి అమలుచేస్తాం. నగరంలో అవకాశమున్న ప్రతిచోట రోడ్లను విస్తరించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేస్తాం. బస్‌షెల్టర్‌లు, ఆటోస్టాండ్‌లు, పార్కింగ్ స్థలాలను అవసరాలకు అనుగుణంగా ఏర్పాటుచేస్తాం.

సౌరవిద్యుత్ వ్యవస్థను నెలకొల్పి, కార్పొరేషన్ విద్యుత్ అవసరాలను తీర్చి విద్యుత్ కొరతను నివారిస్తాం.

నగరంలో ప్రతి వీధికి పెన్నా నీరు అందించడానికి వీలుగా పైప్ లైన్‌లు నిర్మించి రెండు పూటలా నీటి సరఫరా ఏర్పాట్లుచేస్తాం. పేదవారు నివసించే అన్ని కాలనీలలో తగినన్ని వీధి కుళాయిలు ఏర్పాటుచేస్తాం. సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను సత్వరం పూర్తి చేయించి వేసవికాలంలో నీటి సమస్యను తీరుస్తాము. కార్పొరేషన్ ఆధ్వర్యంలో మినరల్ వాటర్ ప్లాంట్స్ ఏర్పాటుచేసి రూ. 2లకే 20లీటర్లు మినరల్ వాటర్ సరఫరా చేస్తాం. డ్రైనేజీ వ్యవస్థ మెరుగపరచడం ద్వారా నగరాన్ని సుదీర్ఘంగా పట్టి పీడిస్తున్న దోమల బెడద నుండి నగరవాసులకు ఉపశమనం కల్పిస్తాం. మెదడు వాపులాంటి వ్యాధుల విస్తరణకు కారణమైన పందులు, వీధి కుక్కల బెడద నుంచి విముక్తుల్ని చేస్తాం. ప్రసూతి వైద్యశాలలో, గవర్నమెంటు చిన్న పిల్లల వైద్యశాలలో మరియు పట్టణ ఆరోగ్య కేంద్రాలలో అన్ని వసతులు కల్పించి, సంపూర్ణ వైద్యసదుపాయాల్ని అందిస్తాం.

పురవీధులను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచుతాం. పాలిథిన్ సంచుల వినియోగాన్ని నియంత్రిస్తాం.

విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా ప్రాంతీయ మార్కెట్‌లను అధునికంగా నిర్మిస్తాం.

మహిళలు, పిల్లలు, వృద్ధులపై జరుగుతున్న నేరాల నివారణకు సిసి కెమెరాలు ఏర్పాటుచేస్తాం. పోలీసుశాఖ సమన్వయంతో గస్తీ ఏర్పాట్లను మరింత పటిష్టంగా ఏర్పాటుచేస్తాం. నగరంలో తగినన్ని మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటుచేస్తాం. అర్హత కల్గిన అన్ని సంఘాలకు బ్యాంక్‌ల సహకారంతో వడ్డీలేని ఋణాలను అందిస్తాం. ప్రతి డివిజన్‌లో పొదుపు సంఘాల సమావేశాలు, మహిళల ఉపాధి శిక్షణా కార్యక్రమాలకు అనుగుణంగా మహిళా భవన్‌లను నిర్మిస్తాం. పొదుపు సంఘాల పర్యవేక్షణకు తగినంత మంది సిబ్బందిని నియమించి సంఘాల అభివృద్ధికి కృషిచేస్తాం.

యువతీ, యువకుల నైపుణ్యతలను పెంచడానికి అన్ని సదుపాయాలతో వికాస కేంద్రాలను ఏర్పాటుచేస్తాం. విద్య, వృత్తి సంబంధిత సమాచారాన్ని, సలహాలను అందిస్తూ, స్వల్పకాలిక లక్ష్య ఛేదన శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తాం.

పురప్రజలు ఆహ్లాదకరమైన ఆరోగ్యకరమైన వాతావరణంలో సేదతీరడానికి అనువైన చోట్ల కార్పొరేషన్ స్థలాలలో తగినన్ని పార్కులు అన్ని వసతులతో ఏర్పాటుచేస్తాం. నిరాదరణకు గురైన చిల్డ్రన్స్ పార్కు స్వతంత్ర పార్కు, మహబూబ్‌ఖాన్ పార్కు మరియు ఇతర పార్కులను తక్షణం అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తాం. పార్కులలో యోగా, వ్యాయామ శాలలు, స్విమ్మింగ్‌ఫూల్స్, స్కేటింగ్ రింగ్‌లు, క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తాం. విజ్ఞాన, వికాస, వినోద కేంద్రాలుగా పార్కులను తీర్చిదిద్దుతాం.

కార్పొరేషన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన విద్యను అందిస్తాం. ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ, ఇతర సిబ్బంది నియామకాలకు చర్యలు చేపడతాం. పాఠశాలలకు తగినన్ని తరగతి గదులను నిర్మిస్తాం.

మురికివాడల్లో నివసిస్తున్న వారికి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తాం. ఇప్పటికీ నిర్వాసితులయిన వారికి ఇళ్ల స్థలాలనిచ్చి, కాలనీలు ఏర్పాటుచేస్తాం.

నగరాన్ని 'గ్రీన్‌సిటీ'గా మార్చడానికి భారీ ఎత్తున చెట్లను పంపిణీ చేసి, చెట్ల పెంపకాన్ని ప్రోత్సహిస్తాం.

నగర శివారు ప్రాంతాలను, ఇటీవల కార్పొరేషనులో విలీనంచేసిన అన్ని గ్రామాల పరిధిలో సంపూర్ణ మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేస్తాం.

పురజనుల సమస్యల తక్షణ పరిష్కారం కోసం ప్రత్యేక ఫిర్యాదుల విభాగం ఏర్పాటుచేసి, టోల్‌ఫ్రీ ఫోన్ నెంబరు సౌకర్యాన్ని కల్పిస్తాం. అత్యవసర సర్వీసులకు ఉచితంగా ఫోన్ చేయడానికి వీలుగా నగరంలో పలు ప్రాంతాలలో ఫ్రీ ఫోన్ సౌకర్యాన్ని కల్పిస్తాము.

ఆటోనగర్, వుడ్‌కాంప్లెక్స్‌లాంటి పారిశ్రామికవాడలలో మెరుగైన అన్ని సౌకర్యాలు కల్పించి పారిశ్రామికాభివృద్ధికి దోహదంచేస్తాం. ఆధునిక వసతులతో కొత్త పారిశ్రామికవాడలను ఏర్పాటుచేస్తాం.

కార్పొరేషన్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా, కబ్జాలకు గురి కాకుండా కాపాడుతాం. అస్తవ్యస్తంగా వున్న ఇంటి పన్ను విధానాన్ని హేతుబద్ధం చేస్తాం.

కార్పొరేషన్ ఆధ్వర్యంలో కార్మికులకు, శ్రమ జీవులకు, పేదలకు రాయితీతో నాణ్యమైన ఉపాహార, భోజన వసతి కల్పిస్తాం. అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపడతాం. వీధి వ్యాపారస్తులకు గుర్తింపు కార్డులు జారీచేసి, వారి భద్రతకు చర్యలుచేపడతాం. బ్యాంకుల సహకారంతో రుణాలు మంజూరు చేయిస్తాం. ఎప్పటికప్పుడు పురజనుల సలహాలను స్వీకరిస్తూ ప్రజల అవసరాలకు తగ్గట్టుగా పాలనను అందించడానికి తెలుగుదేశం కార్పొరేటర్‌లు, నేను అందుబాటులో ఉంటాం. ప్రతి కార్పొరేటర్ తన డివిజన్‌లో ప్రతిరోజు పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి కృషిచేయడం జరుగుతుంది. డివిజన్‌లలో షెడ్యూల్ ప్రకారం ప్రజా సదస్సులు నిర్వహిస్తాం. అన్ని ప్రజా సదస్సుల్లో మేయర్ కార్పొరేటర్, మరియు అధికారులు పాల్గొని ప్రజా సమస్యలను తక్షణం పరిష్కరిస్తాం. ఆధ్యాత్మిక, కళా, సాంస్కృతిక కార్యక్రమాలకు కార్పొరేషన్ తరపున తగు ఏర్పాట్లుచేసి, విజయవంతంగా నిర్వహించడానికి తోడ్పడతాం. నెల్లూరు హెరిటేజ్ కాపాడుతామని, ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెడతానని ఆయన చెప్పుకొచ్చారు.

# సమర్థతకు సవాల్!

**రాజకీయ నాయకుల సామర్థ్యానికి ఎన్నికలు ఒక పరీక్ష. ఎవరు సమర్థులైతే వాళ్లు గెలుస్తుంటారు. కాని విచిత్రంగా ఉన్నతాధికారుల సామర్థ్యానికి కూడా ఎన్నికలే ఒక పరీక్షగా మారుతున్నాయి. ఎన్నికలను ఎంత ప్రశాంతంగా ముగిస్తే ఉన్నతాధికారులు అంత సమర్థులని పేరు.**



జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, జిల్లా ఎస్పీ నవదీప్‌సింగ్... జిల్లాకు కొత్తగా వచ్చినవాళ్లే! జిల్లాలో తొలిసారిగా ఎన్నికల నిర్వహణ చేపట్టారు. ఈసారి సమస్య ఏంటంటే ఒక ఎన్నికలతో అయిపోవడం లేదు. వరుసగా ఒకదానివెంట ఒకటి మూడు రకాల ఎన్నికలను 5వారాలలో జరపాల్సి వస్తుంది. ఈ నెల 30వ తేదీ నెల్లూరు కార్పొరేషన్, కావలి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, ఆత్మకూరు, నాయుడుపేట మున్సిపాల్టీలలో ఎన్నికలు.

కలెక్టర్, ఎస్పీలు రాత్రింబవళ్లు కష్టపడ్డారు. క్రిందిస్థాయి అధికారులు, సిబ్బందిని పరుగులు తీయించారు. వీళ్లు నిద్రపోలేదు, వాళ్లనీ నిద్రపోనివ్వలేదు. మున్సిపల్ ఎన్నికలకు ఓటర్ల జాబితాలను మొదలుకొని పోలింగ్‌బూత్‌ల ఏర్పాటు, సిబ్బందికి విధులు అప్పగించడం, ఈవిఎంలను రెడీ చేయడం, బందోబస్తు చూడడం, రూట్‌మ్యాప్‌లు... ఇవన్నీ కూడా చాలా వేగంగా పూర్తి చేసారు. 30వ తేదీ మున్సిపల్ ఎన్నికలు కాగానే జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలున్నాయి. గ్రామాలలో ఈ ఎన్నికలు చాలా ఉద్రిక్తంగా జరుగుతుంటాయి. అదీగాక ఈ ఎన్నికలకు బ్యాలెట్ పేపర్లను వాడాల్సి వస్తుంది. ఎన్నికల నిర్వహణ చాలా కష్టసాధ్యంగా వుంటుంది. గ్రామీణ ప్రాంతాలలో వర్గ కక్షలు ఎక్కువ. పోలింగ్‌బూత్‌లలో అరాచకశక్తులు జొరబడడం, బ్యాలెట్ పేపర్లు చించేయడం, బ్యాలెట్ బాక్సుల్లో నీళ్లు పోయడం వంటి సంఘటనలు సాధారణంగా జరిగిపోతుంటాయి. వీటిపై ముందుగానే దృష్టిపెట్టాలి. ఇలాంటి సంఘటనలు జరుగుతాయని భావించిన సమస్యాత్మక ప్రాంతాలపై ముందుగా దృష్టిపెట్టాలి. ఆ ప్రాంతాలలో రౌడీషీటర్లను ముందుగానే బైండోవర్ చేసుకోవాలి. స్థానిక ఎన్నికలప్పుడు పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంటుంది. ఈ మద్యం వల్లే గ్రామాలలో వివాదాలు చెలరేగి ఘర్షణలకు దారితీస్తుంటాయి.

జడ్పీ ఎన్నికలు కాగానే మళ్ళీ అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు. మళ్ళీ అసెంబ్లీల వారీగా ఓటర్ల జాబితాలు, పోలింగ్‌బూత్‌లు సిద్ధం చేసుకోవాలి. పోలీసు బందోబస్తును చూసుకోవాలి. తర్వాత కౌంటింగ్ ఏర్పాట్లు చూసుకోవాలి. మే నెలాఖరు దాకా జిల్లా కలెక్టర్‌కు గాని ఎస్పీకిగాని చేతినిండా పని. చేత్తో అన్నంతినే తీరిక కూడా ఉండనంత పని.

# నువ్వొద్దంటే... నేనొస్తాను!





**ఆత్మకూరు నియోజకవర్గంలో ఆనం రామనారాయణరెడ్డి చేసిన అభివృద్ధి పనులను చూస్తే రేపటి ఎన్నికల్లో ఆయన నామినేషన్ వేసి ప్రచారానికి రాకుండా ఇంట్లో కూర్చున్నా గెలవాలి. ఆత్మకూరు నియోజకవర్గానికి ఏ నాయకుడూ చేయనంత పని చేసాడు. ఎవరూ తేలేనన్ని నిధులు తెచ్చాడు. ఇది ఎవరైనా ఒప్పుకోవాల్సిన వాస్తవం. ఆత్మకూరుకు ప్రాతినిధ్యం వహిస్తున్నందుకు ఆయన పూర్తి న్యాయం చేసాడు. కాబట్టి వచ్చే ఎన్నికల్లో ఆయన ఖచ్చితంగా గెలవాలి.**

కాని ఇప్పుడు అక్కడ గెలిచే పరిస్థితి లేదు. చేసిన వందలకోట్ల రూపాయల అభివృద్ధి పనులన్నీ అక్కరకు రావడం లేదు. జనాలు ఆయన చేసిన అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. నువ్వు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా వస్తే మాత్రం ఓట్లేసే ప్రసక్తే లేదంటున్నారు. అదే ఇండిపెండెంట్‌గా పోటీ చేసినా గెలిపిస్తామంటున్నారు. కాంగ్రెస్‌పార్టీ, హస్తం గుర్తు అంటేనే జనం మండిపడుతున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లోనూ ఆత్మకూరు కాంగ్రెస్ నాయకులు చాలామంది తెలుగుదేశం అభ్యర్థులుగా లేదంటే ఇండిపెండెంట్ అభ్యర్థులుగా పోటీలో ఉండడం విశేషం.

ఆనం ఆత్మకూరు నుండి మళ్లీ కాంగ్రెస్ అభ్యర్థిగా రంగంలోకి దిగితే గెలుపు కష్టమే. పార్టీ ఆయనకు పూర్తి మైనస్. ఆయన దిగకుండా తెలుగుదేశం నుండి ఇంకెవరైనా అభ్యర్థి దిగితే గట్టిపోటీ నెలకొనే అవకాశం వుంది. కాంగ్రెస్ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేయకపోతే తెలుగుదేశం అభ్యర్థిగా ఇక్కడ బరిలో దిగడానికి డాక్టర్ బొల్లినేని భాస్కర్‌రావు ఉత్సాహపడుతున్నట్లు సమాచారం. ఆనంకు బొల్లినేని కుటుంబానికి సత్సంబంధాలున్నాయి. కాబట్టి ఆనం దిగితే బొల్లినేని భాస్కర్‌రావు రాకపోవచ్చు. ఆనం దిగకపోతే బొల్లినేని రావచ్చు. తెలుగుదేశం, వైసిపిల మధ్య ప్రధానపోటీ అవుతుంది. కాంగ్రెస్ కేడరంతా కూడా తెలుగుదేశంలోకి వెళ్లే అవకాశముంది. అప్పుడు వైసిపి అభ్యర్థి గౌతంరెడ్డికి గట్టి పోటీనే ఉంటుంది.

Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**.